కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక

డిసెంబరు 2011

http://kottapalli.in/2011/12/welcome

సంపాదకులు: నారాయణ

ముఖచిత్రం 'ఎడారిలో దేవుడు': వీరాంజనేయులు

అక్షర కూర్పు: *కొత్తపల్లి*

ఇంటర్నెట్‌లో ఈ పుస్తకాన్ని వివిధ ఫార్మాటుల్లో ఉచితంగా చదవవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు, అవసరమనిపిస్తే మీ వాణిజ్యేతర కార్యక్రమాలకోసం మీ అంతట మీరే దీన్ని ముద్రించుకోవచ్చు!

కాపీరైటు: ఈ పుస్తకంలోని ఏ అంశాన్నైనా ఎవరైనా తమ వాణిజ్యేతర కార్యకమాలలో పూర్తిగా ఉచితంగా, స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చు. కేవలం ఆయా రచయితలకు, కొత్తపల్లి పత్రికకు వాటిని ఆపాదిస్తే సరి. వివరాలకు చూడండి: http://www.creativecommons.org వారి non-commercial, share alike license.

కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

ఫోను: **08559 240222, 7702877670** ఇ-మెయిలు: **team@kottapalli.in**

విషయసూచిక

ముందుమాట

నీళ్ళు-వజ్రాలు... సంపాదకీయం...2

ధారావాహిక

నీతి చంద్రిక ... కందుకూరి వీరేశలింగం...6

పిల్లలు రాసిన కథలు

పెద్దల మాట...సుష్మభార్గవి...13

కంచె..శ్రీలత...15

స్త్రీశక్తి...భార్గవి...17

వారసుడు...సాయిధనుశ్రీ...22

పెద్దలు రాసిన కథలు

పచ్చ గణపతి...లలిత...28

చంటిగాడి పళ్లతోట...ఆదూరి హైమవతి...31

రాక్షసుడే నయం...రాజశేఖర్...37

తెలివి-బలం...రాధ...40

పులి-చిలుక...సహాన...44

రేగుపళ్ళ రుచి...పర్తాప్ అగర్వాల్...49

కార్టూన్ కథలు

నోటి దుర్వాసన...అనురాగ్...26

చదువు -పని...నందన, వినయ్...55

అవీ-ఇవీ

బొమ్మకు కథ రాయండి...లలిత...27

క్రిస్టఫర్ పాలిని...సౌమ్య...57

సమీక్ష...మాలతీకృష్ణ...59

పదరంగం...దేవి...61

పాటలు

చిట్టి పాటలు...జైసీతారాం...62

నీళ్ళు-వజ్రాలు

సహారా ఎడారిలో పోతూ దారి తప్పారు రాము-సోము.

ఎటెటో తిరిగారు- సరైన దారి చిక్కనే లేదు.

రెండు రోజులు గడిచేసరికి, వాళ్ళ దగ్గరున్న నీళ్ళన్నీ అయిపోయాయి.

దాహం..ఎండ.

ఇంక ఒక్క అడుగు కూడా ముందుకు వేసే పరిస్థితి లేదు.

అప్పుడు వాళ్ళకు దేవుడు గుర్తొచ్చాడు. ఇప్పుడు వాళ్ళకి సాయం చేయగలిగింది ఆయన ఒక్కడే.

మనసులో ఆ దేవుడినే తలచుకున్నారు ఇద్దరూ, ఆర్తిగా..మళ్ళీ మళ్ళీ.

అట్లా మగతలో, ఇసకలో, మండుటెండలో పడిపోయిన వాళ్ళని చూసి జాలిపడ్డాడు దేవుడు.

వాళ్ళ ముందు ప్రత్యక్షం అయ్యాడు.

దేవుడిని కళ్ళెత్తి చూసేంత శక్తి కూడా మిగల్లేదు వాళ్ళలో- దేవుడి మాటలు కూడా సరిగ్గా వినబడటంలేదు వాళ్ళకు.

దేవుడు చెబుతూ పోయాడు చాలా సేపు- "చూడండి, అందం పై పైనే ఉంటుంది. మీరు 'అందంగా ఉంది' అనుకునే వస్తువులో నిజానికి పస ఉండకపోవచ్చు. 'అస్సలు బాగాలేదు' అనుకునే వస్తువులో అపార సంపదలు దాగి ఉండవచ్చు. నిజానికి ఎవరికైనా ఉపయోగపడేది మంచి మనస్సే. అదొక్కటి ఉంటే చాలు- అన్నింటా విజయం వరిస్తుంది.."

రాము సోములకు దేవుడి ప్రవచనాలు అక్కర్లేదు- స్వామీ, మాకు కాసిని నీళ్ళు ఇవ్వండి చాలు. మిగతావి మేం సొంతంగా ఆలోచించుకొని నేర్చుకుంటాం" అన్నారు స్వామికి అడ్డొస్తూ.

"అవునవును. అందుకే వచ్చాను నేను. నా వరకూ మీరిద్దరూ ఒకటే- అయినా ఎవరికి ఏది కావాలో ఎంపిక చేసుకొనే అవకాశం మీకిద్దరికీ వేరు వేరుగా ఇస్తాను" అని, దేవుడు రాముని దగ్గరికి పిలిచి, రహస్యంగా రెండు సంచులు చూపించాడు. ఒక సంచీ చాలా బాగుంది. మఖ్మల్ బట్టతో కుట్టి, బంగారు తాళ్ళతో అలంకరించి ఉన్నది. ఇంకో సంచీ ముతకగా, పాత తోలుతో చేసిన తిత్తిలాగా ఉన్నది.

"వీటిలో నీకు ఏది కావాలో తీసుకో" అన్నాడు.

"రెండోది వాడికి ఇస్తావా?" అన్నాడు రాము, సోమువైపు చూస్తూ. "ఊహు, అతనికీ రెండు అవకాశాలు ఇస్తాను" అన్నాడు దేవుడు.

"అన్యాయం. మరి రెండిటిలోనూ ఏది మంచిదో ఎట్లా తెలుస్తుంది ఎవరికైనా?" అన్నాడు సోము.

"చెప్పలేం. ఎవరు కోరుకున్న సంచిలో ఏముంటుంది అన్నది పూర్తిగా వాళ్ళ రాత మీద ఆధారపడి ఉంటుంది. మనుషుల రాతను నేనే కాదు, ఎవ్వరూ మార్చలేరు" అన్నాడు దేవుడు.

రాము రెండు సంచులనూ మార్చి మార్చి చూశాడు. రెండూ సమానం బరువు ఉన్నై. చివరికి

చూపులే గెలిచాయి. అందంగా ఉన్న సంచీ మీద ఆశ పుట్టింది. మఖ్మల్ సంచిని ఎంచుకున్నాడు రాము.

అదే సమయంలో దేవుడు సోముకూ రెండు సంచుల్ని చూపించాడు. సోము ఎక్కువ ఆలోచించకుండా తోలు తిత్తిని ఎంచుకున్నాడు.

దేవుడు ఇద్దరినీ దీవించి మాయం అయిపోయాడు. అయినా ఇద్దరికీ కనిపించకుండా అక్కడే నిలబడి చూడసాగాడు.

రాము హడావిడిగా విప్పి చూశాడు- మఖ్మల్ సంచిలోపల అద్భుతమైన వజ్రాలు ఉన్నై!

సోము తోలు సంచిలో చూసుకున్నాడు- నిండా నీళ్ళు ఉన్నై!!

దు:ఖం కొద్దీ రాము బావురుమన్నాడు- "ఈ వజ్రాలను నేనేం చేసుకోను? రూపానికి ఆశపడద్దని దేవుడు అంతసేపు చెప్పినా వినకపోతినే?! మఖ్మల్ సంచిని ఎంచుకున్నందుకు నాకు తగిన శాస్తి జరిగింది. ఇప్పుడు ఇక నాకు చావే గతి!" అని.

సోము వాడిని ఓదార్చాడు- "ఎందుకురా, అంత బాధ? మనిద్దరం కలిసే కద, వచ్చింది? కలిసే పోతాం. తోలు సంచీలో నీళ్ళు ఇద్దరికీ సరిపోతాయిలే. త్రాగి నడక మొదలెడదాం. ఏదో ఒక దారి దొరక్క పోదు" అన్నాడు తోలుతిత్తిని అతనికి అందిస్తూ.

ఇద్దరూ త్రాగినా, ఇంకా కొన్ని నీళ్ళు మిగిలాయి తిత్తిలో! కొంతదూరం నడిచాక, వాళ్లనే వెతుక్కుంటూ వస్తున్న మనుషులు ఎదురయ్యారు వాళ్ళకు.

ఆపైన రాము సోములు ఇద్దరూ వజ్రాలను సమానంగా పంచుకున్నారు.

అప్పటివరకూ వాళ్ళను కాపాడుకుంటూ వస్తున్న దేవుడు చిన్నగా నవ్వి మాయం అయిపోయాడు.

మనుషున్నాక కష్టాలూ సుఖాలూ అన్నీ ఎదురౌతుంటాయి. సరిగ్గా కలిసి బ్రతికితే కష్టాలు తగ్గుతాయి; సుఖాలు అంతకంత పెరుగుతాయి.

రానున్న 2011 లో అందరి సుఖాలూ అంతకంత పెరగాలని ఆశిస్తూ,

అభినందనలతో-

కొత్తపల్లి బృందం.

తెలుగు ముత్యాలు

చిట్టి కవితలు

తెలుగు భాషే తేట గీతోయ్
తెలుగు వెలుగే మంచి బాటోయ్
తెలుగు మాటే గొప్ప పాటోయ్
తెలుగు మరువకురా!

చదువు చదివితె చాలునా అది
విలువ లేనిదె చదువు కాదోయ్
విలువ చదువుతొ వెలుగు వెలుగోయ్
విలువ చదువేనోయ్!

రచన: తాడేల రాంబాబు, తొమ్మిదవ తరగతి, ప్ర.ఉ.పాఠశాల, పాతపట్నం, శ్రీకాకుళం జిల్లా.

నీతి చంద్రిక

విగ్రహం-3

జరిగిన కథ: పక్షులకు రుచించని సలహానిచ్చిన కొంగ భంగపడుతుంది. వెనక్కి తిరిగి వచ్చి, అప్పుడు ఏం జరిగిందో తమ రాజైన హంసకు విన్నవించుకుంటున్నది. దాన్ని మధ్యలోనే నిలువరించింది హంసరాజు. ఇక చదవండి, నీతి చంద్రిక 26 వ భాగం.

మూలం: కీ.శే. కందుకూరి వీరేశలింగం   *సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

"తన శక్తి, ఇతరుల శక్తి ఎంతటివో తెలీక, క్రొవ్వు పట్టినట్లు ఎక్కువవాళ్లను ఎదిరించదలచిన వెఱ్ఱివాడు కష్టాలకు పుట్టినిల్లు అవుతాడు. ఇదివరకు ఒక పావురానికి ఇలాగే మదమెక్కి, ఒక డేగతో పోరు పెట్టుకొని భంగపడింది. నీకు ఆ కథ చెబుతాను విను- అని 'పావురాల జంట-డేగ' కథ చెప్పటం మొదలు పెట్టింది హంసరాజు.

పావురాల జంట-డేగ

పాండ్య దేశంలో మధుర అనే ఒక పట్టణం ఉండేది. ఆ పట్టణంలోని గుడినొకదానిని ఆశ్రయించుకొని ఒక పావురాల జంట

నివసిస్తూ ఉండేది. ఒక రోజున ఆ జంట గుడి మంటపంలో నేలమీద అటూ ఇటూ తిరుగుతూ ఉన్న సమయంలో దూరం నుండి ఒక డేగ వాటిని చూసింది. వాటిని పట్టి తినాలని, అది ఆ మంటపంలోకి దూరేందుకు పలువిధాలుగా ప్రయత్నించింది. కానీ దాని పరిమాణం పెద్దది కావటం చేత, అది లోనికి దూరలేకపోయింది. "వంట ఇంటి కుందేళ్ళేగదా, ఈ పిట్టలు!? తప్పించుకొని ఎక్కడికి పోతాయిలే!" అనుకొని అది అప్పటికిగాను తన ప్రయత్నాన్ని విరమించుకొని గూటికి ఎగిరిపోయింది.

దాని ఈ ప్రయత్నాన్నంతా పావురాలు రెప్పలు ఆర్పకుండా నిలబడి చూశాయి. అప్పుడు ఆడపావురం తన భర్తతో అన్నది-"చూశావా? ఇప్పుడా డేగ మనల్ని పట్టుకొనేందుకని ఇక్కడికి వచ్చికూడా, ఈ కోట గోడలు మనకిస్తున్న రక్షణను ఛేదించలేక వెనక్కి మరలిపోయింది! మన వైపుకు అది ఎంత కోపంతోచూసిందో, నువ్వూ చూశావుగద! మనం చేసుకున్న పుణ్యం వల్ల, ఈ రోజుకు మనం దాని పాలబడకుండా తప్పించుకోగలిగాం. ఇక మీదట అది ఎప్పుడూ మనమీద కన్ను వేసే ఉంటుంది. కనీసం ఇప్పుడన్నా మనం ఈ చోటును విడిచిపెట్టి వేరే ఎక్కడికన్నా పోకపోతే, ఏదో ఒకరోజున దాని బారిన పడతాం. బలవంతులతో విరోధం ఎంతటి వారికైనా సరే, మేలు కూర్చదు. అందుకని మనం ఈ ప్రదేశాన్ని వదిలి, డేగ భయం లేని వేరే సురక్షిత ప్రదేశానికి తరలిపోదాం. "మా తాత త్రవ్వించిన చెరువు" అని దానిలో మునిగి చస్తామా, ఎక్కడన్నా? 'సరే, అదే నయం' అనుకుందామన్నా, ఇది మన పూర్వులు సంపాదించి పెట్టిన ఆస్తి ఎలాగూ కాదు. ఈ స్థలాన్ని పట్టుకొని వ్రేలాడనూ లేక, దీనినుండి బయటికి రానూ రాలేక, ఊరికే చచ్చిపోయేది ఎందుకు? ఇప్పుడిక ఈ శత్రువుకి తగిన ఉపాయాన్ని వెంటనే వెతకాలి- ఆలస్యం కూడదు. ఆలసించామంటే ప్రాణాలే కోల్పోతాం. అందుకని, ముందుగానే మేలుకోవటం అవసరం. ఎంత కష్టం వచ్చి-పడింది, మనకు?!" అని కళ్ళనీళ్ళు

నింపుకొని, జీరబోయిన గొంతుతో ఏడ్చింది ఆడపావురం.

అప్పుడు మగపావురం దాని భయాలను కొట్టిపారేస్తూ, లేత నవ్వుతో ముఖం చివురించగా "ఎందుకు, ఇట్లా అర్థంలేని భయాలు పెట్టుకొని బాధ పడతావు? నా శక్తి ఎంతటిదో తెలీక మనసుకు అనవసరపు భయాలను అద్దుకుంటావెందుకు? 'ఉన్న ఊరు, కన్న తల్లి ఒకే రూపు' అని వినలేదా? తోటివాడి దెబ్బకు జంకి, ఉన్న ఇంటిని పాడుబెట్టి, పారిపోతే ఇరుగు పొరుగులు మనల్ని చూసి నవ్వరా? పరువు పోవటం తప్ప దీనివల్ల వేరేఎలాంటి లాభమూ లేదు. దైవం ఎదురొడ్డినప్పుడు మనం ఎలాంటి ప్రయత్నం చేసినా నీటిమీది రాతల్లాగా ఏలాంటి ప్రయోజనమూ ఉండదు. వెయ్యి ఉపాయాలు కూడా మన నుదుటి వ్రాతను మార్చలేవు. ఈ శరీరాన్ని ధరించిన వాడి సుఖదు:ఖాలు భగవంతుని కోరిక మేరకు ఏర్పడుతుంటాయి. వాటిలో మన ప్రమేయం ఏమీ ఉండదు. రమ్మంటే సుఖాలు వస్తాయా, పొమ్మని త్రోసివేస్తే కష్టాలు పోతాయా?

ఇంకోటి చెప్తాను, విను- 'ఎంత పరాక్రమవంతులైనా నా ముందు తల ఎత్తేందుకు భయపడతారు- తుచ్ఛమైన ఈ డేగ ఎంతటిది? డేగ కూడా ఒక రకపు పక్షే- దయ్యం కాదు గద, అది?! ఒక నీచపు డేగను తలచుకొని మనసులో ఇంత భయపడతా-వెందుకు? అది కూడా పక్షే ; నేను కూడా పక్షినే. ఎక్కడైనా ఒక వజ్రం మరొక వజ్రం కంటే తక్కువదౌతుందా? ఎందుకు, ఊరికే పనికి-మాలిన పిరికితనాన్ని బోధిస్తావు, నాకు?

ఆ మోసకారి పక్షి మన మీదికి వస్తే ఒక్క ముక్కుపోటుతో దాన్ని చంపివేయనా? వజ్రంలాంటి నా వాడిగోళ్ళతో దాన్ని చీల్చి

చెండాడనా? గొప్పవాళ్ళు తమ శౌర్య పరాక్రమాలను క్రియారూపంగా చూపుతారు తప్పిస్తే, మాటల్లోప్రకటించేందుకు ఇష్టపడరు. ఊరికే నాకు-నీకు వాగ్వివాదం ఎందుకు? నువ్వు చూసి మెచ్చుకొనే సందర్భమూ వస్తుంది- నా మాట నమ్మి, ఆవగింజంత చింతకూడా లేక, నిశ్చింతగా ఉండు. మనకిప్పుడు వచ్చిన భయం ఏమీ లేదు' అని ఊరడించింది.

అది విని ఆ ఆడపక్షి భర్త మాటకు ఎదురు చెప్పటం ఇష్టం లేక, తన లోపలి ఆరాటం నుండి ఊరట లేక, మనను ఆందోళనతో ఊగిసలాడగా, ముఖం వెలవెలపోగా వెర్రి నవ్వు ఒకటి నవ్వి ఊరుకున్నది.

ఇక ఆ డేగ కూడా పగబట్టిన దానికిమల్లే మరునాడు ఉదయాన్నే- ఇంకా సూర్యుడు ఉదయించకనే- వచ్చి, ఆలయంనుండి బయటికి వెళ్ళేవైపుగా ఉన్న ప్రహరీగోడ మీద చూపు నిలిపి, మాటు వేసి కూర్చున్నది. సూర్యోదయం కాగానే పక్షులు రెండూ ఎప్పటి మాదిరి ఆహారంకోసం బయటికి వచ్చి ఎగిరి పోబోయాయి- అయితే ఆ నాటితో ఆడ-పావురానికి మగపావురంతో ఋణం తీరి-పోయింది కాబోలును- డేగ గబుక్కున వచ్చి మగ పావురాన్ని బలంగా తన ముక్కుతో కరచుకొని పోయి, ఆనాటి భోజనానికి దానినే తొలి ముద్దగా చేసుకొని, ఇష్టంగా భోంచేసింది.

ఆడపావురంకూడా పులినోట చిక్కిన మాంసం జారి పడ్డట్లు, చావు తప్పి కన్ను లొట్టపోగా దేవాలయంలోకి దూరింది. ఎంతటివారైనా చేసుకున్న తప్పుల ఫలం అనుభవించి తీరాల్సిందే కదా! కాబట్టి బలవంతునితో విరోధం మనకే చేటు తెస్తుంది.

అంతేకాదు- ఎంత బలం ఉన్న వాడికైనా పరుషమైన మాటలు మేలు గూర్చవు.

దానివల్ల అన్ని పనులూ నిష్ఫలమే అవుతాయి. గొడ్డలితో నరికిన చెట్టైనా తిరిగి చిగురిస్తాయేమోగాని, మాటల వల్ల విరిగిన మనసు మాత్రం ఇక చక్కబడదు. నోటిమాట చక్కగా లేకనే గద, ఇదివరకు ఒక గాడిద అకాల మృత్యువు వాత పడింది?! నీకు ఆ కథ చెబుతాను, విను:

పులితోలు కప్పుకున్న గాడిద

కరిపురం అనే ఊళ్ళో విలాసుడు అనే చాకలివాడు ఒకడు ఉండేవాడు. ఆ చాకలివాడు పొరుగూరునుండి క్రొత్తగా ఒక గాడిదను పట్టి తెచ్చుకున్నాడు. దాన్ని బాగా మేపి బలిసేటట్లు చెయ్యాలని ఉబలాట పడ్డాడతను. అయితే అంత మేతను కొని తేలేక, 'తగిన ఉపాయం ఏమిటా' అని ఆలోచించాడు.

చివరికి అతనికో ఉపాయం తట్టింది. ఆ గాడిద ఒంటిమీద ఒక పులితోలు కప్పి, అప్పుడప్పుడు అడవికి దగ్గరగా ఉన్న పొలాలలోకి తోలటం మొదలు పెట్టాడు. ఆ పొలాల కాపులు రాత్రిపూట మసక వెలుగులో పులి తోలు కప్పుకున్న ఆ గాడిదను చూసి 'నిజం పులే' అనుకుని భయంతో కంపించి పోయేవాళ్ళు. దాని దగ్గరికి వచ్చేందుకు కూడా భయపడి అటునుండి అటే పారిపోయేవాళ్ళు. ఆ విధంగా నిరాటంకంగా ఎల్లప్పుడూ పచ్చని పైరుగడ్డి కడుపారా దొరకటం చేత, దాన్ని మేసీ మేసీ గాడిద బాగా బలిసి, ఇష్టం వచ్చినట్లు నిర్భయంగా తిరగటం మరిగింది.

ఇట్లా కొంత కాలం గడిచింది. అడవికి

దాపులనున్న పొలపుకాపు ఒకడు 'తన పొలం అట్లా నశించిపోతున్నదే' అని చాలా బాధపడ్డాడు. బాగా ఆలోచించి, చివరికి మనసును గట్టిపరచుకున్నాడు. గుండెను రాయి చేసుకున్నాడు; 'సాహసోపేతమైన పని చెయ్యాల్సిందే- పులి అంతు తేల్చాల్సిందే' అనుకున్నాడు. ఒకనాటి రాత్రి బూడిదరంగు దుప్పటిని ఒంటినిండా కప్పుకొని, పొలంలోకి దూరాడు. ఆ పొలానికి అవతలివైపున ఉన్న ఒక పెద్ద చెట్టు మాటున, కంటి రెప్ప వాల్చకుండా నిలబడ్డాడు- ఒక బాణాన్ని ధనుస్సుకు పూన్చి.

తన అలవాటు ప్రకారం పొలంలో మేసేందుకు వచ్చిన గాడిద, దూరంగా చెట్టు నీడన ఉన్న ఆకారాన్ని చూసి, చీకట్లో మరొక గాడిద అనుకున్నది. కాలం మూడింది కాబోలు, అది గట్టిగా ఓండ్ర పెడుతూ ఆ రూపం వైపుకు పరుగుపెట్టింది.

ఆ అరుపును విన్న పొలంకాపు నిర్ఘాంతపోయి, మరు నిముషంలో వాస్తవాన్ని గ్రహించాడు. చిరునవ్వుతో అతని ముఖం పదింతలైంది. "ఓరి! ఈ కిలాడి గాడిదా, ఇన్నాళ్ళూ మా అందరి కళ్ళూ కప్పింది!" అని అతను నిర్భయంగా దాని దగ్గరికిపోయి, ఒక పెద్ద కట్టెతో ఆ గాడిదను మోది అవలీలగా దాన్ని యమపురికి పంపించాడు.

కాబట్టి, మాట తీరు బాగుండటం అవసరం. మాటలోని పరుషత్వం ఎప్పుడైనా గానీ తప్పకుండా కీడునే తెచ్చిపెడుతుంది. కాబట్టి, తన మేలు కోరేవారు ఎవరైనా అది తెలుసుకొని, అణగి మణగి ఉండాలి. సరే, అది అటుండనివ్వు- తర్వాత ఏం జరిగిందో చెప్పు" అన్నది. అప్పుడు కొంగ తన కథనాన్ని ఇలా కొనసాగించింది:

పక్షులతో యుద్ధానికి కూడా సిద్ధపడి నిలిచానని చెప్పాను కదా, ఇందాక? అట్లా స్థిరంగా

నిలిచిన నన్ను చూసి పక్షులన్నీ మరింత రెచ్చిపోయాయి.

"ఓ స్వామిద్రోహీ! తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టినట్లు, మా దేశంలోనే తిరుగుతూ మా రాజులో తప్పులెంచుతావా? అందుకు శిక్షగా నిన్ను ఈ క్షణంలోనే వధించవలసి ఉన్నది. అంతటి పాపానికి ఒడి కట్టిన నీ పట్ల కొంచెం కూడా దయ చూపవలసిన అవసరం ఉన్నదంటావా?

తిన్నది అరగక, కాలం గడవక, నోటి తీటతో ఇంతవరకూ తెచ్చుకున్నావు. చేసుకున్న పాపాన్ని అనుభవించక తప్పదు.

మేం ఎవరం అనుకున్నావు? శౌర్యమే అలంకారంగాగల చిత్రవర్ణుడి అనుచరులం మేము. తెలీదా?

(ఇంకా ఏమన్నాయో మళ్ళీ...)

జోకు

వాదకులు!

'వాళ్లెవరండీ, చిన్న గొడవకే గంటల తరబడి వాదించుకుంటున్నారు?'

'ఓహో, వాళ్లా...! లాయర్లండీ'

అంటించుకుందాం!

రాము: కాగితాలు అంటించుకోవాలి. కాస్త ఆ జిగురు ఇలా తెచ్చిపెట్టు అఖిల్.

అఖిల్: దానికి జిగురెందుకు నాన్నా. నీ దగ్గర అగ్గిపెట్టె ఉందిగా.



పెద్దల మాట

రచన: యం.సుష్మ భార్గవి, తొమ్మిదవ తరగతి, అభ్యాసవిద్యాలయం, విజయవాడ.

అనగా అనగా రామాపురం అనే ఊళ్లో గణేష్, అన్వేష్ అనే ఇద్దరు మంచి స్నేహితులు ఉండేవారు. వాళ్ళు చిన్నప్పటి నుండీ కలిసి ఉండేవాళ్ళు; వాళ్ళకి ఏం కావాలన్నా ఇద్దరూ కలిసి వెళ్ళి తెచ్చుకునేవాళ్లు. అయితే అందరు పిల్లల్లాగే వీళ్ళ ఆలోచనలు కూడా వేరు వేరుగా ఉండేవి. పెద్దలు చెప్పిన మాట వినేవాడు గణేశ్. అన్వేష్ మటుకు ఎవ్వరి మాటా వినేవాడు కాదు. "పెద్దవాళ్ళు చెప్పింది చేసి చూస్తే ఏమి?" అనేవాడు గణేశ్. "ఏ పనైనా మనకు ఇష్టమైతేనే చెయ్యాలి" అనేవాడు అన్వేష్.

ఒకసారి ఇద్దరూ యీత కొట్టేందుకు వెళ్లారు. తిరిగి ఇంటికి రాగానే ఇద్దరికీ దగ్గు, జలుబు

మొదలయ్యాయి. గణేష్ వాళ్ల అమ్మ వెంటనే వాడికి మిరియాల కషాయం , రవ్వ గంజి ఇచ్చి, వావిలాకులతో ఆవిరి పట్టింది.

అన్వేష్ వాళ్లమ్మ కషాయం ఇస్తానంటే వాడు ఒప్పుకోలేదు. దోసె కావాలని గొడవ చేసి, కడుపు నిండా దోసెలు తిన్నాడు. ఆవిరి పట్టుకోలేదు.

మరుసటి రోజుకల్లా గణేష్ ఆరోగ్యం కుదురుకున్నది. కానీ అన్వేష్ మాత్రం బయట కనబడ లేదు. ఆరోజు సాయంత్రం గణేశ్ బయలుదేరి అన్వేష్ వాళ్ళ ఇంటికి వెళ్లాడు. ఆ సరికే అన్వేష్‌కి జ్వరం ఎక్కువైపోయిందట. డాక్టర్‌గారి దగ్గరికి పిల్చుకుపోతే ఆయన ఆస్పత్రిలో చేర్చమన్నారు. ఊపిరి తిత్తులలో తేమ ఎక్కువ ఉన్నదని కృత్రిమ శ్వాస కూడా పెట్టారట. మూడు రోజుల్లో ఐదారు వేల రూపాయలు ఖర్చయ్యాయి. చివరికి, నాలుగో రోజున అన్వేష్ నీరసంగా ఇల్లు చేరుకున్నాడు.

అటు తర్వాత గణేష్ తన స్నేహితుడిని పలకరించేందుకు వెళ్తే, గణేశ్ వాళ్ల అమ్మ అన్నది- 'నువ్వు మాత్రం ఒక్కరోజులో బాగయ్యావురా, వీడు చూడు, నేను చెప్పినమాట వినక, ఎంత కంగారు పెట్టాడో!" అని.

ఎవరికైనా మొండి పట్టుదల ఉండకూడదు, ఒకవేళ ఉంటే అది చదువు విషయంలోనే ఉండాలి. ✿

తెలివి ఎక్కువైంది! జోకు

కుమార్: నేను సరిగా చదవటం లేదని మాస్టారు మొట్టికాయలు వేస్తున్నారు!

సోము: మరి ఏం చేస్తున్నావురా? బాగా చదువుతున్నావా?

కుమార్: లేదు, బడికి హెల్మెట్ పెట్టుకొని వెళ్తున్నా!

కంచె

రచన: ఆర్.శ్రీలత, 6 వతరగతి, శ్రీవిశ్వభారతి విద్యాలయం, గాంధీనగరం, జహీరాబాద్.

చోడవరంలో లింగయ్య కూలిపని చేసు-కుంటూనే మొక్కల్ని పెంచుకునేవాడు. మొక్కల పెంపకం పట్ల అతనికి ప్రత్యేక శ్రద్ధ ఉండేది. అందువల్ల అతని దగ్గర లేని మొక్కలంటూ ఉండేవికావు. ఆ గ్రామంలో ప్రజలు ఎవరికి ఏ మొక్క కావల్సి వచ్చినా లింగయ్య వద్దకే వచ్చి తీసుకెళ్లేవారు.

ఒకసారి త్వరగా ఎదిగి, ఎక్కువ దిగుబడి ఇచ్చే రెండు రకాల పండ్ల మొక్కల్ని తెచ్చాడు లింగయ్య, ఏదో దూర ప్రాంతం నుండి. తన పెరట్లో గుంతలుత్రవ్వి రెంటినీ నాటాడు .

మేకలు, ఆవులు, ఇతర జంతువులు వాటిని పాడు చేయకుండా చుట్టూ కంచె వేయబో-యాడు. అంతలో ఆ రెండిటిలో ఒక మొక్క లింగయ్యతో "అయ్యయ్యో! ఆగు లింగయ్యా! నా చుట్టూ కంచె వేసి నన్ను బంధిస్తావా?

నాకు కంచె వద్దు! స్వేచ్ఛగా ఎదగనివ్వు, నన్ను. నన్ను చూస్తే నీకు జాలి కలగటం లేదా?" అన్నది.

"అయ్యో! నా ఉద్దేశ్యం అది కానే కాదు! కంచె లేకపోతే నీకు రక్షణ ఉండదు. ఆవులు, మేకలు అన్నీ నిన్ను తినేస్తాయి!" అని చెప్పాడు లింగయ్య. అయినా ఆ మొక్క వినలేదు. "సరే, నీ ఇష్టమే కానివ్వు" అని , లింగయ్య దాన్ని వదిలేసి, రెండో మొక్కకే కంచె వేశాడు.

ఆ మరునాడే ఒక మేక వచ్చింది. ముందుగా అది కంచె వున్న మొక్కని తినడానికి ప్రయత్నించింది. దానికది సాధ్యం కాలేదు. అంతలో కంచెలేని మొక్క కనబడింది దానికి. దాన్ని చూడగానే సంతోషంగా ఆ మొక్క దగ్గరికి పరుగెత్తిందది. ఆకుల్ని తింటూ మొక్కనే లాగేయటానికి ప్రయత్నించింది. ఆ మొక్కకి ప్రాణాలు పోయినంత పనైంది. అంతవరకూ అలాంటి అనుభవం లేదేమో, గజగజా వణికిపోయింది పాపం.

అంతలోనే ఎక్కడినుండి వచ్చాడో, లింగయ్య పరుగు పరుగున వచ్చి మేకని వెళ్లగొట్టాడు. ఆ అనుభవంతో ఒక్క నిముషంలోనే వడలి-నట్లు అయిపోయింది మొక్క.

"ఇందుకే గద, తల్లీ, నీ చుట్టూ కంచె వేస్తానన్నది? నువ్వు కాస్త పెరిగి, నీ వేళ్ళ భూమిలో బలంగా నాటుకుంటే, ఆ తర్వాత నీకు కంచె అవసరం ఉండదు. అప్పుడు నిన్ను ఇంక ఎవరూ ఏమీ చేయలేరు. అప్పటి వరకూ నీకు తగిన రక్షణ ఉండాలి గదా! అంతవరకూ కనీసం, నేను చెప్పిన మాట విను, కంచె వేయనివ్వు" అన్నాడు లింగయ్య దానితో.

'రైతు వచ్చి తరిమి ఉండకపోతే మేక తనను అన్యాయంగా తినేసేది కదా?' సంగతి అర్థమైన మొక్క చాలా సిగ్గుపడ్డది. తనను మన్నించి కంచె వేయమని లింగయ్యను ప్రాధేయపడింది.

లింగయ్య అలాగే చేశాడు. అటుపైన మొక్క బలంగా ఎదిగింది. పెద్ద మానులా తయారైంది. అటుతర్వాత దానికి ఇక కంచె అవసరం రాలేదు మళ్ళీ!



స్త్రీ శక్తి

రచన: కె.భార్గవి,8 వతరగతి, ప్రకృతిబడి. మార్పు చేర్పులు: కొత్తపల్లి

అనగా అనగా ధర్మపురి అని ఒక రాజ్యం ఉండేది. దానికి రాజు ధర్మపాలుడు. పేరుకు తగ్గట్టే రాజ్యాన్ని ధర్మంగా పరిపాలించేవాడు ఆయన. ధర్మపాలుడి భార్య సునందాదేవి ఆయనకు అన్నివిధాలా తగినది.

"ఎన్ని ఉండీ ఏం లాభం? వారసులు లేరు" అని చెప్పుకునేవాళ్ళు ప్రజలు, వాళ్ల గురించి ఎప్పుడు మాట్లాడినా. వారసులకోసం రాజు-రాణి తిరగని గుడి లేదు, మునగని నది లేదు.

దేవతలు అందరూ కరుణించినట్లు, చివరికి రాణి గర్భం దాల్చింది. రాజుగారి ఆనందానికి మేర లేదు. రాజ్యమంతటా ప్రజలు పండుగలు జరుపుకున్నారు. రాజ్యానికి వారసుడు లభించనున్నాడని మురిసిపోయారు. చూస్తూండగానే రాణికి అందాల బొమ్మవంటి కుమార్తె జన్మించింది.

రాజుగారితో సహా అందరూ చిన్నబోయారు. అందరూ రాజకుమారుడికోసం ఎదురు-

చూస్తున్నారు- అమ్మాయి పుట్టేసరికి వాళ్లందరి ఆనందంమీద నీళ్ళు చల్లినట్లు అయ్యింది. రాజ్యాన్ని పరిపాలించవలసింది అబ్బాయే కదా? అమ్మాయిలకి సింహాసన యోగ్యత ఉండదు! రాజకుమార్తె పుట్టుక ఆ రకంగా పెద్ద విషాదమే అయ్యింది. సంబరాలన్నీ మరునాటికల్లా సద్దు మణిగి పోయాయి.

చక్కని చుక్కలాంటి ఆ పాపను చూసుకొని నిజంగా మురిసిపోయింది రాణి ఒక్కతే. రాజుగారైతే అటు తర్వాత రాణిగారి అంత:పురంలో అడుగే పెట్టలేదు. అంతకు క్రితం వరకూ 'మహారాణీ'అని చుట్టూ తిరిగిన ప్రజలెవ్వరూ ఇప్పుడు ఆమెను పట్టించు-కోవటమే లేదు! అయినా రాణి మాత్రం పాపకు ఏమీ తక్కువ చేయలేదు. తానూ ధైర్యం కోల్పోలేదు. ఆ పాపకు పరిమళ అని పేరు పెట్టి తండ్రి లోటు తెలీకుండా అల్లారు ముద్దుగా పెంచసాగిందావిడ.

సునందాదేవి స్వయంగా తానే ఆ పాపకు అనేక విద్యలు నేర్పింది. అటుపైన రాజగురువు సత్యానందులవారి సహకారం తోడవటం పరిమళకు కలిసి వచ్చింది. సత్యానం-దులవారు పరిమళకు అనేక శాస్త్రాలు, యుద్ధ-విద్యలు నేర్పారు. పువ్వు పుట్టగానే పరిమళి-స్తుందన్నట్లు, పరిమళ కూడా అన్ని విద్యలలోనూ ఎంతో ఆసక్తి కనబరచింది. 13 ఏళ్ళు వచ్చేసరికి అనేక శాస్త్రాలు నేర్చు-కోవటంతో పాటు, అసమాన యోధురాలు కూడా అయ్యింది.

ఆమె ముందు ఎంతటి పరాక్రమవంతులైనా ఓడిపోయేవాళ్ళు. కానీ పరిమళకు మాత్రం 'ఎప్పుడెప్పుడు బయటి ప్రపంచాన్ని చూద్దామా, ఎప్పుడెప్పుడు తండ్రి ముందు తన విద్యల్ని ప్రదర్శిద్దామా' అని ఉండేది. అయితే ఈ విషయం ఎప్పుడు ప్రస్తావించినా ఆమె తల్లి మాత్రం అంగీకరించేది కాదు.

ఒక రోజున ఆ పాప సత్యానందులవారిచేత సునందాదేవికి చెప్పించింది; తానూ ఎంతో బ్రతిమాలింది- 'మన రాజ్యంలోని ప్రజలను మాత్రమే పరిశీలించి వచ్చేస్తాన'ని. చివరికి ఎలాగో అనుమతి సంపాదించుకున్నది.

ఆపైన వెంటనే సిద్ధంగా ఉంచుకున తన గుర్రం ఎక్కి, రాజ్యంలోకి బయలుదేరింది పరిమళ.

అలా పోతూ పోతూ, కనబడ్డ ప్రతి పల్లెలోనూ ఆగి, గుర్రం దిగి, అక్కడి ప్రజల సామాజిక స్థితిని గమనించటం మొదలు పెట్టింది. ప్రతి చోటా స్త్రీలు ఇంటి పనుల్లో మునిగి ఉన్నారు, లేదా పొలం పనుల్లో మునిగి ఉన్నారు. చాలా చోట్ల కూలికి పోయి ఆడవాళ్ళే ఇంటికి కావలసిన ఖర్చులు సంపాదిస్తున్నారు. అధిక శాతం మంది మగవాళ్ళు ఊరికే రోడ్ల వెంబడి తిరుగుతున్నారు- బాధ్యతా రాహిత్యం మగవారిలోనే ఎక్కువగా కనిపించింది.

రాజ్యంలో స్త్రీల పరిస్థితిని గమనించిన కొద్దీ పరిమళకు ఉద్రేకం కలిగింది . "నా రాజ్యంలో స్త్రీలు ఎందుకు, ఇలా హీనమైన పనుల్లో ఇరుక్కొని ఉండిపోవాలి? తమ సామర్ధ్యాలను వాళ్ళందరూ ఎందుకు గుర్తించలేకున్నారు? రాజ్యంలో పురుషులు ఎందుకు, ఇలా బాధ్యత లేకుండా తిరుగుతున్నారు? స్త్రీలందరికీ నాలాగా యుద్ధ విద్యలు నేర్పించాలి. లేదంటే ఈ రాజ్యానికి రక్షణ ఉండదు" అనుకున్నది.

వెంటనే సునందాదేవిని కలుసుకొని తన ఆలోచనను చెప్పింది. మొదట ఆవిడ నవ్వి, పరిమళను ఏమార్చేందుకు చూసింది. కానీ పరిమళ పట్టు విడువలేదు. చివరికి, పరిమళ ఉత్సాహాన్ని చూశాక, ఆ తల్లికీ అర్థమైంది- తమ కష్టాలు తీరే సమయం దగ్గర్లోనే ఉన్నదని!

ఆవిడ మాట్లాడిన మీదట, నిత్యానందుల-వారు మహారాజుకు చెప్పారు: "మహారాజా! మన రాజ్యంలో అధికశాతం స్త్రీ శక్తి వృధానే అవుతున్నది. స్త్రీ చైతన్యమే రాజ్యానికి శ్రేయస్సు

అని చెబుతారు పెద్దలు. మన రాజ్యంలోని స్త్రీలను ఉద్దేశించి పెద్ద స్థాయిలో విద్యా కార్యక్రమాలు చేపట్టవలసి ఉన్నది. వారి శక్తి మేరకు వారికి యుద్ధ విద్యలూ నేర్పాలి. దీనికి మన యువరాణి పరిమళాదేవివారు సరైన నాయకులని మాకు అనిపిస్తున్నది. మీ అభిప్రాయం తెలియజేయండి" అని.

ఆనాటివరకూ రాజుగారు పరిమళ గురించి ఆలోచించనే లేదు! ఒకసారి ఆ పాప ప్రస్తావన రాగానే ఆయన ఈ విషయమై రాణిగారి తోటీ, మహామంత్రి తోటీ సంభాషించారు. మంత్రి-గారికి పరిమళ శక్తి సామర్థ్యాలు తెలుసు. అందుకని ఆయనకూడా రాజగురువు అభిప్రాయాన్నే బలపరచాడు.

దాంతో రాజుగారు వెంటనే రాజ్యమంతా ఈ విషయాన్ని దండోరా వేయించారు. "మన దేశంలోని స్త్రీ శక్తిని గుర్తిస్తూ, వారికోసం ప్రత్యేక విద్యా కార్యక్రమం ఒకటి తయారు చేయటమైంది. యువరాణి పరిమళాదేవి ఆధ్వర్యంలో వారికి అనేక శాస్త్రాలు, యుద్ధ విద్యలు నేర్పించటం జరుగుతుంది. మరీ చిన్నపిల్లలు, ముసలివాళ్ళు, రోగులకు తప్ప, మిగిలిన వారందరికీ ఇది తప్పనిసరి. స్త్రీలంతా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని లబ్ధి పొందాలహో" అని. ప్రజల్లో చాలామందికి, ముఖ్యంగా మగవారికి, ఈ కార్యక్రమం నచ్చలేదు. కానీ రాజాజ్ఞ కనుక, ఎవరికేగానీ ఒప్పుకోక తప్పలేదు.

అయితే పరిమళ ఉత్సాహం, కార్యదీక్ష రాజ్యంలోని స్త్రీలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎన్నడూ ఇల్లు దాటి ఎరుగని స్త్రీలుకూడా వివిధ శాస్త్రాలు చద-వటంతో బాటు క్లిష్టమైన యుద్ధ విద్యలలో శిక్షణ పొందసాగారు. ఇలా ఒక్క ఏడాదిలోనే ఎంతోమంది రకరకాల విద్యలు నేర్చు-కున్నారు. రాజ్యమంతటా చైతన్యం తొణికిస-లాడింది. ఇదివరకటి స్తబ్దత, నిరాశ ఇప్పుడు లేవు. ఇప్పుడు ధర్మపురి రాజ్యం ఒక ప్రత్యేకమైన రాజ్యం- అక్కడ ప్రతి స్త్రీ ఒక ఆదిశక్తి.

అదే సమయానికి పొరుగు దేశపు రాజు మార్తాండుడు ధర్మపురిపైకి దండెత్తి వచ్చాడు.

మార్తాండుని సైన్యం పెద్దది. వారి సైనిక శిక్షణ కూడా విలక్షణమే. వారిముందు తమ సైన్యం ఎందుకూ పనికిరాదు! భయపడుతూనే యుద్ధానికి వెళ్ళిన ధర్మపాలుడు, అనుకున్నట్లే కష్టాలలో పడ్డాడు. మార్తాండుని సైన్యం ఆయన్ని అన్నివైపులనుండీ చుట్టుముట్టింది. అదే సమయానికి ఎక్కడినుండి వచ్చిందో, అసంఖ్యాకమైన సైన్యం ఒకటి మార్తాండునిపై విరుచుకు పడ్డది. ఆ సైనికుల పరాక్రమం ముందు నిలువలేని మార్తాండుని సైన్యం కకావికలైంది. అనుకోకుండా అందిన ఈ సహాయాన్ని ధర్మపాలుని సైన్యం చక్కగా ఉపయోగించుకున్నది. మార్తాండుడిని పూర్తిగా తిప్పికొట్టింది.

తమకు అంతగా సాయం చేసిన సైన్యం ఎవరిదో ధర్మపాలుడికి అర్థంకాలేదు. నిండు సభలో వారి సైనిక శక్తిని కొనియాడి, వారి నాయకుడికి తన కృతజ్ఞత తెలియజేసుకున్నాడు. తీరా చూస్తే అది నాయకుడు కాదు- నాయకురాలు! ఆమె కూడా వేరెవరో కాదు- యువరాణి పరిమళ! ఆ సైన్యం తన రాజ్యపు స్త్రీశక్తే!

ఆశ్చర్యంతోటీ, ఆనందంతోటీ మహారాజు నోటివెంట మాట రాలేదు. ఆడపిల్ల అనగానే పరిమళను తాము ఎంత చిన్నచూపు చూసిందీ, సునందా దేవిని ఎంత అవమానించిందీ, ఇన్నాళ్ల తర్వాత ఆ బిడ్డే తమను ఎలా ఆదుకున్నదీ- అన్నీ గుర్తుకొచ్చి, పశ్చాత్తాపంతో ఆయన కళ్లనీళ్ళు పెట్టుకున్నాడు.

అందరి సమక్షంలో సునందాదేవికి క్షమాపణ చెప్పటంతోబాటు, 'తన తర్వాత రాజ్యాన్ని పరిపాలించేది పరిమళే' అని సభాముఖంగా ప్రకటించాడు ఆయన.

యువరాణి పరిమళ నాయకత్వంతో ధర్మపురి ప్రజల చైతన్యంలో గొప్ప మార్పులే వచ్చాయి!

దేశమును ప్రేమించుమన్నా- మంచియన్నది పెంచుమన్నా
ఒట్టి మాటలు కట్టిపెట్టోయ్- గట్టి మేల్ తలపెట్టవోయ్

వారసుడు

రచన: సి.సాయిధనుశ్రీ, 6 వతరగతి, రాధాస్కూల్ ఆఫ్ లర్నింగ్, అనంతపురం.

అనగనగా ఒక రాజ్యంలో ఒక జమీందారు ఉండేవాడు. అతనికి ఇద్దరు కొడుకులు- రామరాజు, భీమరాజు. ఇద్దరూ అందంగా, బలంగా ఉండేవాళ్ళు; ఇద్దరూ తెలివైనవాళ్ళే.

జమీందారు గారికి ఒక్కోసారి 'తన తర్వాత దివాణం ఎవరికి అప్పజెప్పాలి' అని దిగులు వేసేది. ఏమంటే ఏ ఒక్కరికి దివాణం బాధ్యత అప్పజెప్పినా రెండోవాడు నొచ్చుకునే ప్రమాదం ఉన్నది మరి!

అందుకని జమీందారుగారు చాలా రోజులు ఆలోచించి, కొడుకులు ఇద్దర్నీ పిలిచి, "ఒరే! మీరిద్దరూ ఇప్పుడు పెద్దయ్యారు. ఇద్దరికీ మీవంటూ శక్తి సామర్ధ్యాలు తయారయ్యాయి. త్వరలో మీరు దివాణం బాధ్యతలు చేపట్టాలి- నా బరువూ తగ్గించాలి. అయితే దానికి సమాజం గురించిన అవగాహన చాలా అవసరం.

అందుకని మీరిద్దరూ ఇప్పుడు దేశాటన

చేయాలి. దేశాటన అంటే ఊరికే గుర్రాలెక్కి దేశం అంతా తిరగటం కాదు- మీదంటూ ఏదో ఒక పల్లెను ఎంచుకొని, అక్కడ సామాన్యుల- లాగా ఒక సంవత్సరంపాటు జీవించాలి. ఆ సమయంలో మీరు నా కొడుకులనిగానీ, సంపన్నులని గానీ ఎవ్వరికీ తెలియకూడదు. వీలైనంత తక్కువ ఖర్చుతో బ్రతకాలి ఈ ఏడాది అంతా.

సంవత్సరం పూర్తిగా గడిచాక, మీలో ఎవరు ఎలా గడుపుతున్నారు అన్నదాన్నిబట్టి, నా బాధ్యతల్ని మీకు పంచుతాను - మరి వెళ్ళి రండి" అని ఇద్దరికీ చెరొక బండెడు శనక్కాయలు ఇప్పించి పంపాడు.

రామరాజు తూర్పు దిక్కుగా ప్రయాణించి, చీకటి పడే సమయానికి ఒక పల్లె చేరుకున్నాడు. అక్కడ ఒక పూటకూళ్ళమ్మ దగ్గరకు వెళ్ళి భోజనం పెట్టమన్నాడు. ఆ తర్వాత, డబ్బులు ఇవ్వాల్సి వచ్చేసరికి, దర్పంగా 'నేను ఎవరనుకున్నావు? జమీందారు గారి కొడుకును!' అని బుకాయించాడు. పూటకూళ్ళమ్మ ఎందుకు ఊరుకుంటుంది? 'ఎవరైనా కావచ్చు- నా డబ్బులు నాకు ఇచ్చెయ్యాల్సిందే' అని పట్టుపట్టి, అందరినీ పిలిచి రగడ చేసింది.

ఊళ్ళోవాళ్ళు కూడా అతను జమీందారు కొడుకంటే నమ్మలేదు. అతని దగ్గరున్న శనక్కాయలు అమ్మి అయినా సరే, ముసలమ్మ అప్పు తీర్చాలని తీర్మానించారు.

రామరాజు తన దగ్గరున్న బండెడు విత్తనాలనూ అమ్మి, ఆ డబ్బుతో డాబుగా

కొన్నాళ్ళు బ్రతికాడు అదే ఊళ్ళో. కూర్చొని తింటే కొండలు కూడా కరిగిపోవా? ఆ డబ్బు త్వరలోనే అయిపోవచ్చింది- ఇక అతను కొన్నాళ్లపాటు ఊళ్ళో అప్పులు చేస్తూ బ్రతికాడు. ఇంకా ఆరు నెలలు కూడా కాకుండానే, అప్పులవాళ్ళు అతన్ని కొట్టే పరిస్థితి వచ్చేసింది. దాంతో అతను ఎవరికీ చెప్పాపెట్టకుండా తండ్రి దగ్గరికి చేరుకున్నాడు!

ఇక భీమరాజు పడమటి దిక్కుగా ప్రయాణించి, ఒక పచ్చని ఊరు చేరుకు-న్నాడు. అక్కడ పదిమందినీ విచారించి, చిన్న భూమి ఒకదాన్ని కౌలుకు తీసుకున్నాడు. తను తీసుకెళ్ళిన శనగ విత్తనాల్ని ఆ భూమిలో నాటి, అందరిలాగే కష్టపడ్డాడు. ఊళ్ళో-వాళ్ళంతా 'అబ్బ! భీముడు మంచి పనిమం-తుడబ్బా' అనుకునేట్టు పనిచేశాడు. ఐదు నెలలు గడిచేటప్పటికి అతని విత్తనాలు అతనికి తిరిగి రావటమే కాదు; చాలా లాభం కూడా వచ్చింది. ఆ డబ్బుతో అతనొక చిన్నపాటి చేనును కొనుక్కున్నాడు కూడా. అలా సంవత్సరం తిరిగేటప్పటికి, తను ఒక్కడే తినటం కాదు; పదిమందికి అన్నం పెట్టే స్థితికి చేరుకున్నాడు.

ఇక సంవత్సరం గడిచినా భీముడు దివాణానికి తిరిగి రాలేదు. అతన్ని వెతుక్కుంటూ జమీందారు గారే ఆ పల్లెకు చేరుకున్నారు! అప్పుడుగానీ భీముడు జమీందారు బిడ్డడని ఊళ్ళోవాళ్ళకి తెలీలేదు!



'అయ్యో! తెలీక ఇన్నాళ్ళూ మేం నిన్ను ఏదేదో అని ఉంటాం నాయనా! మనసులో పెట్టుకోబాక' అన్నారు ఊళ్ళో వాళ్లంతా.

భీమరాజు నవ్వుతూ 'మీరు ఇట్లా అంటారనే గద, నేను మా నాన్న పేరు చెప్పనిది! మీరు నన్ను నన్నుగా చూడటమే నాకు ఇష్టం. ఇంతకాలం నన్ను మీవాడుగా ఆదరించారు.

ఇప్పటికిప్పుడు నన్ను పరాయివాడిని చేయకండి' అన్నాడు. అతను తండ్రివెంట దివాణానికి వెళ్తుంటే సగం ఊరు వెంట వచ్చి వీడ్కోలు పలికింది.

దివాణాన్ని ఎవరికి అప్పజెప్పాలో తెలిసి-పోయింది. జమీందారు గారు మెల్లమెల్లగా తన బాధ్యతలన్నీ భీమరాజుకు అప్పజెప్పటం మొదలుపెట్టారు.

అటుపైన రామరాజుకు రాజధానిలో తగిన ఉద్యోగం దొరకటంతో, వారసుడి సమస్య సులభంగానే పరిష్కారమైంది. ప్రజల కష్ట-సుఖాలు తెలిసిన భీమరాజు తర్వాత్తర్వాత మంచి జమీందారుగా పేరు తెచ్చుకున్నాడు.

చిలిపి ప్రశ్నలు-తిక్క జవాబులు

ఆఫీసర్ అదిరిపడేదెప్పుడు!?

జవాబు: జాయినింగ్ రిపోర్టు తీసుకున్న ఉద్యోగి "జీతం ఎప్పుడిస్తారుసార్" అని అడిగినప్పుడు!!

విమానాశ్రయం దగ్గర బిచ్చగాడి స్లోగన్...!?

జవాబు: ఒక డాలరు ధర్మం చెయ్యండి బాబూ! ఒక డాలరు ధర్మం చెయ్యండమ్మా!!

బటర్‌ఫ్లై అంటే.....!?

జవాబు: వెన్న మీద వాలే ఈగ!!

సేకరణ: శ్రీ వివియస్ మూర్తి, చొదిమెళ్ళ, పశ్చిమ గోదావరి జిల్లా

నోటి దుర్వాసనతో ఇంకా ఏమైంది?

(గతమాసం తరువాయి..)

అనురాగ్ గోదావరి
ఆరవ తరగతి



బొమ్మకు కథ రాయండి

నిర్వహణ: శ్రీమతి జి.లలిత, telugu4kids.com

ఈ బొమ్మను చూడండి:



ఒంటె!

అక్కడ ఉన్నది యజమానేనా? ఒంటె అతనికి ఏదో రహస్యం చెబుతున్నట్లుంది?! ఏమిటా రహస్యం, ఏమా కథ? మీకు తప్పకుండా తెలిసే ఉంటుంది. మాకు ఆ కథ రాసి పంపండి, బాగుంటే కొత్తపల్లి ఫిబ్రవరి 2012 సంచికలో ప్రచురిస్తాం.

మా చిరునామా: కొత్తపల్లి బృందం, యం ఆర్ వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా-515101, Ph: 08559 240222, 7702877670.

ఆకుపచ్చ గణపతి

కొత్తపల్లి అక్టోబరు2011 సంచికలో ఇచ్చిన "బొమ్మకు కథ రాయండి" కి స్పందన

రచన: శ్రీమతి లలిత, telugu4kids.com

వాళ్ళ అమ్మతో కలిసి కూరగాయలు కొనడానికి బయలుదేరాడు గోపీ. కూరలాయమ్మ పేరు రంగమ్మ. గోపీ వాళ్ళ అమ్మ కూరగాయలు ఎప్పుడూ రంగమ్మ దగ్గరే కొంటూ ఉంటుంది. అప్పుడప్పుడూ గోపీని కూడా తనతోబాటు తీసుకువెళ్తుంది.

అమ్మ కూరగాయలు బేరం చేస్తుంటే గోపీ ఆ కూరగాయలతో ఆడడం మొదలు పెట్టాడు. సొరకాయను ఒకదాన్ని తీసుకుని భుజాన పెట్టుకుని, ఆంజనేయుడిలా పోజులు ఇవ్వ సాగాడు.

రంగమ్మ అది చూసి కంగారు పడ్డది- "దాంతో ఆడకు బాబూ! కింద పడితే పచ్చడౌతాది. ఇంక తినడానికి పనికి రాదు" అని ఆ సొరకాయని మెల్లగా గోపీ దగ్గర్నుంచి తీసేసుకుంది.

ఇంటికి వెళ్ళాక, అమ్మ వెంటే వంటింట్లోకి దారి తీశాడు గోపీ. అమ్మ కూరగాయలు సర్దుకుంటుంటే, ఒక కాలీఫ్లవరును పూల గుత్తిలా పట్టుకుని వాళ్ళ అమ్మకు ఇస్తూ, "ప్రపంచంలో అందరికంటే అద్భుతంగా వంటలు వండే మా అమ్మకి ఈ పూల గుత్తి బహుమానం!" అంటూ ముందుకు వంగి అందించాడు.

వాళ్ళ అమ్మ గోపీకి ఇష్టమని పచ్చి క్యారట్లు తినడానికి ఇస్తే, పళ్ళెంలో వాటిని ఏటవాలుగా ఒకదానికి ఒకటి ఆనించి, "ఇదిగో అమ్మా, ఈ కొండలు చూడు! వీటిని నేను ఇట్టే ఎక్కెయ్యగలను!" అంటూ రెండు వేళ్ళను కాళ్ళులాగా నిలిపి ఆ కొండలు ఎక్కుతున్నట్టు నటించాడు.

మర్నాడు మళ్ళీ బజారుకు వెళ్ళ వలసిన పని

పడింది అమ్మకి. గోపీ తను కూడా వస్తానని బయలుదేరాడు. "నాకు అక్కడే వేరే పని కూడా ఉంది ఒకటి. నిన్ను అక్కడికి తీసుకు వెళ్ళటం కుదరదు. అందుకని ఇవాళ్ల నువ్వు ఇంట్లోనే ఉండు" చెప్పింది అమ్మ.

"నన్ను రంగమ్మ బండి దగ్గర ఉంచి నువ్వు నీ పని చూసుకుని రావచ్చు కదా!" అన్నాడు గోపీ. "వద్దులే నాయనా! నువ్వు రంగమ్మ కూరగాయలతో ఆడి వాటిని పాడు చేస్తావు!" అంది గోపీ వాళ్ళ అమ్మ.

"నేను అల్లరి చెయ్యనుగా, నిజం! నాకు కూరగాయలంటే చాలా ఇష్టం. తీసుకు వెళ్ళవా అమ్మా ప్లీజ్!" బ్రతిమాలాడు గోపీ.

"సరే. ఈ రోజు అల్లరి చేస్తే మాత్రం ఇంకెప్పుడూ వెంట తీసుకు వెళ్ళను మరి" గట్టిగా చెప్పింది అమ్మ.

రంగమ్మ బండి దగ్గర గోపీని ఉంచి, త్వరగానే వచ్చేస్తానని చెప్పి, గోపీ వాళ్ళ అమ్మ తన పని మీద వెళ్ళింది. రంగమ్మ ముందు జాగ్రత్తగా ఒక చిన్న బుట్టలో కొన్ని కూరగాయలు పెట్టి, గోపీ దగ్గర ఉంచింది. "ఇంకేవీ ముట్టుకోవద్దు నాన్నా!" అని చెప్పింది. "రంగమ్మే మంచిది అమ్మ కంటే. నాకు ఎన్ని కూరలు ఇచ్చిందో, చూడు! " అని మురిసిపోయాడు గోపీ.

గోపీ వాళ్ళ అమ్మ తిరిగి వచ్చే సరికి రంగమ్మ బండి దగ్గర మామూలుకంటే ఎక్కువ మంది గుమిగూడి ఉన్నారు.

అమ్మ కంగారు పడింది. 'ఏమయ్యిందో' అని అనుమానపడింది. 'గోపీ ఏం అల్లరి చేశాడో' అని గబగబా వెళ్ళి చూసింది. గోపీ

చిన్నబుట్టలో కూరగాయలను గణపతి ఆకారంలో అమర్చి ఉన్నాడు. దాన్ని చూసేందుకు జనాలందరూ కుతూహలంగా దగ్గరికి చేరి ఉన్నారు. 'హమ్మయ్య! ఏం కాలేదులే!' అనుకుని ఊపిరి పీల్చుకుంది అమ్మ.

అంతలో రంగమ్మ అన్నది- "మీ బాబు గణపతిని ఎంత చక్కగా చేసిండో చూశావమ్మ? ఈ బొమ్మని చూడనీకి వచ్చి, అందురూ ఇయాల నా దగ్గర ఎక్కువ కూరగాయలు కొనుక్కని పోయిండ్రమ్మ"- అని. అట్లా మురిసిపోతూ గోపీ వాళ్ళ సంచీలో ఇంకొన్ని క్యారట్లు కొసరుగా వేసింది రంగమ్మ.

కొన్ని రోజుల తర్వాత గోపీ, వాళ్ళ అమ్మా కలిసి రంగమ్మ బండి దగ్గర కూరగాయలు కొనడానికి వచ్చారు. ఈ సారి గోపీ చేతిలో ఒక బుట్ట ఉంది. అందులో కూరగాయలతో చేసిన గణపతి బొమ్మ ఉంది!

ఇంతకు ముందు తనకు వచ్చిన ఆలోచననే ఇంకొంచెం మెరుగు పరిచి, కళ్ళూ అవీ స్పష్టంగా గీసి, చిన్న చిన్న పుల్లలతో కూరగాయలు పడిపోకుండా కుదురుగా నిలిచేలా అమర్చి, చిన్న పళ్ళెంలో కూర్చోబెట్టి తెచ్చాడు గోపీ.

"రేపు వినాయకుడి పండగ కద. 'పచ్చపచ్చగా కూరగాయలు ఎదగాలంటే మన భూమి బాగుండాలి. ఈసారీ, ఇక ముందూ కూడా, రంగులూ, రసాయనాలూ వాడకుండా చేసిన మట్టి గణపతి విగ్రహాలే కొని పూజ చెయ్యండి' అని చెప్పు రంగమ్మా, అందరికీ " చెప్పాడు గోపీ, ఆమెకు పచ్చ గణపతిని అందిస్తూ.

"మా బాబే, ఎంత అందంగా ఉన్నాడయ్యా ఈ గణపయ్య. మట్టి గణపతి గురించి అందరికీ చెబుతా. కానీ నేను ఈ పచ్చ గణపతికే పూజ చేస్తానయ్యా రేపు. మా గణపయ్య లాగే నీకూ ఆకులు కాయలంటే బలే ఇష్టంలే," అంది రంగమ్మ నవ్వుతూ.

దానాల్లోకెల్లా నిదానం శ్రేష్ఠం.

చంటి గాడి పండ్ల తోట

పండ్ల తోట! ఎట్లా ఉండాలి?! ఎలా పెంచాలి?! ఈ కథ చదివి చూడండి....ఇది కథా, జీవితాదర్శమా, అసలు?

రచన: శ్రీమతి ఆదూరి హైమవతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, బెంగళూరు.

చంటి గాడికి అప్పుడప్పుడే ఐదేళ్ళు వచ్చాయి. "ఇహ ఆటలు కట్టిపెట్టి బడికి పోవాలి" అన్నాడు నాన్న. "ఓం పోతా! నేనెందుకు పోను?!" అన్నాడు చంటి. "మా నాన్నే!" అని మురిసిపోయింది బామ్మ.

తర్వాత ఒక రోజున చంటిగాడు నిద్రలేచేసరికి ఇల్లంతా హడావిడిగా ఉంది. ఎవర్ని పిలిచినా పలికేలా లేరు. అమ్మ వంటగదిలో ఉంది. అప్పుడే ఏవేవో వంటలు చేసేస్తోంది. నాన్న పనివాళ్ళకు పనులు పురమాయిస్తున్నాడు. చంటిగాడు పూజగదిలో ఉన్న బామ్మ దగ్గర-కెళ్ళాడు- "బామ్మా! గడపలకు పచ్చగా పసుపు పూసి, ఎఱ్ఱగా కుంకుమ బొట్లు పెట్టారేంటి? గుమ్మాలకు ఆకుపచ్చ మామిడి

ఆకులేంటి? స్తంభాలకు ఆ అరటి చెట్లేంటి? రంగురంగుల ఆ పూలేంటి? నల్లని ఆ పలక ఎవరికి? ఆ తెల్ల చొక్కాయి, నీలం నిక్కరు ఎవరికి? ఈ రోజు ఏం పండగ?" అంటూ సందేహాలవర్షం కురిపించాడు.

బామ్మ నవ్వింది- "అబ్బో! ఫరవాలేదే, చంటీ! నీకు రంగులన్నీ తెలిసి పోయాయి, బళ్ళో చేరటానికి అర్హత వచ్చినట్లే! ఈ రోజు నువ్వు బళ్ళో చేరే పండగరా, చంటీ!" అంది.

ఆరోజు చంటి వెళ్ళి తల స్నానంచేసి, అమ్మ ఇచ్చిన కొత్త చొక్కాయి వేసుకుని అమ్మ-నాన్నలతోపాటు పీటలమీద కూర్చుని పూజ చేశాడు. అందరూ కలిసి వాడికి అక్షరాభ్యాసం చేశారు.

అదే రోజున వ్వాడు బడిలో చేరాడు. అదే రోజున ఒకటోతరగతి పంతులుగారు పలకపైన 'ఓ న మః' రాసి ఇచ్చారు వాడికి. చంటిగాడు అన్నాడు "మానాన్న ఇంట్లో బియ్యంలో రాసేసారుగా వీటిని?!" అని. పంతులు గారు నవ్వి "ఇక మీదట వీటిని రోజూ తరగతిలో నీ అంతట నువ్వే రాయాలి, తెలుసా?" అని అడిగారు. బుద్ధిగా తల ఊపాడు చంటి. "నువ్వు చక్కగా మా బళ్ళో చేరావు కదా, అందుకని ఇవాళ్ళ నీకు మేం ఏవో బహుమతులు ఇస్తాం. ఏమిటో కనుక్కో!" అన్నారు పంతులుగారు. చంటి ఏవేవో వస్తువుల పేర్లు చెప్పాడు గానీ, అవేవీ కావన్నారు పిల్లలు, నవ్వుతూ.

ఆరోజు సాయంకాలం బడి వదలగానే పంతులుగారు వచ్చి, ఐదు పండ్ల మొక్కలు తెచ్చి ఇచ్చాడు చంటికి. స్కూల్లో పిల్లల వయసును బట్టి, ఎవరిది ఎన్నో పుట్టిన-రోజైతే, అయ్యవార్లు వాళ్ళకి ఆ రోజున అన్ని మొక్కలు బహుమతిగా ఇస్తారట- ఒకటో తరగతిలో ఐదు; రెండో తరగతిలో ఆరు, మూడో తరగతిలో ఏడు; ఇలాగ! వాళ్ళు వాటిని ఎక్కడో ఒక చోట నాటి, శ్రద్ధగా పెంచాలట!

చంటిగాడు బామ్మని, అమ్మని ఊపిరి తిప్పుకోనివ్వక, ఆ మొక్కల్ని నాటేవరకూ గొడవ చేస్తూనే ఉన్నాడు. ఇంటికి నాలుగు మూలల్లోనూ నాలుగు మొక్కలు నాటారు-

ఇక మరో బాదం మొక్క మాత్రం మిగిలింది. "దాన్ని పెరట్లో వంట గది బయట పెట్టండర్రా ! చక్కగా ఆకులు కోసుకుని విస్తరి కుట్టుకుని భోజనం చేయచ్చు" అన్నది బామ్మ.

అప్పుడు మొదలైంది ఆ అలవాటు- ప్రతిరోజూ చంటిగాడు నిద్రలేవగానే వెళ్ళి ముందుగా బాదం మొక్క దగ్గర కూర్చొని ముఖం కడుక్కునేవాడు. ఆపైన ఇంటిచుట్టూ తిరిగి అన్ని మొక్కల్నీ చూసుకునేవాడు. వాటన్నింటికీ నీళ్ళు పోసి, ఆ తర్వాతగానీ తను స్నానం చేసేవాడుకాదు!

అట్లా వాడు రెండో తరగతికి వచ్చేసరికి అయ్యవార్లు మరో ఆరు మొక్కలిచ్చారు. మూడో తరగతికి వచ్చేసరికి ఏడు మొక్కలు. నాలుగో తరగతిలో ఎనిమిది. ఐదులో తొమ్మిది మొక్కలు. అటుపైన వాడు హైస్కూలుకు పోవలసి వచ్చింది!

హైస్కూల్లో పిల్లలకు మొక్కలు ఇచ్చేవాళ్ళు కాదు. అయినా చంటిగాడి బామ్మ ఊరుకుంటేగా? ప్రతి సంవత్సరం వాడి పుట్టిన రోజుకి ఆమె తనంత తానుగా వాడికి మొక్కల బహుమతి ఇవ్వటం మొదలు పెట్టింది. అలా అలా చంటిగాడు పదో తరగతికి వచ్చేసరికి 95 మొక్కలు, అదనంగా వాడి స్నేహితులు తెచ్చి ఇచ్చినవి 13- మొత్తం 108 మొక్కలతో 'చంటిగాడి పండ్ల తోట' తయారయింది!

మామిడి, సపోటా, దానిమ్మ, నిమ్మ, జామ, పనస, నారింజ, బత్తాయి ఇంకా రకరకాల అరటి పండ్లు, కాయలతో కళకళలాడి-పోతున్నది వాడి తోట. ఊళ్ళో ఎవ్వరికీ అంత మంచి తోట లేనే లేదు!

పదోతరగతి పరీక్షల తర్వాత, పాఠశాల వార్షికోత్సవ సభలో పెద్ద పంతులు గారు మాట్లాడుతూ "చంటి మా బళ్ళో చదవడం మాకెంతో గర్వకారణం. తనకు ఐదో ఏట

లభించిన మొక్కనుండి, పదో తరగతిలో వచ్చిన మొక్క వరకూ అన్ని మొక్కలనూ బ్రతికించి, తన పండ్లతోటలో అందంగా, నిండుగా నిల్పుకుని, పరిసరాల పరిరక్షణ కావిస్తున్న చిన్న రైతు- చంటి. అతన్ని కొంత సేపు తన తోట గురించి చెప్పమని కోరుతున్నాను" అన్నారు ఆప్యాయంగా.

జిల్లా అధికారులంతా చేరిన ఆసభలో చంటి లేచి నిలబడి ప్రసంగించాడు-

"ముందుగా మా చిన్నప్పటి బడిలోని అయ్యవార్లందరికీ, ఆ తర్వాత మా బామ్మ-గారికి, అమ్మ-నాన్నలకూ వందనాలు అర్పిస్తున్నాను. సభికులందరికీ నమస్కా-రాలు! అయ్యవార్లు, ఇంట్లో పెద్దలు కూడా పిల్లలకు సహకరిస్తే ఎవరైనా సాధించలేనిదేదీ ఉండదు. ప్రతి బడీ మా బడిలాగానూ, ప్రతి అయ్యవారూ మా అయ్యవార్లలాగాను ఉంటే దేశమే మారిపోతుంది. పరిసరాల కాలుష్యం పెరగదు. పర్యావరణ సమతౌల్యం దెబ్బ-తినదు. ఎవరికి కావలసిన ప్రాణవాయువు వాళ్ళ పరిసరాల లోనే తయారౌతుంది. అందరూ ఆరోగ్యంగా జీవించవచ్చు.

నిజానికి ఈ సన్మానం చెందాల్సింది నాకు కాదు- నాకు మొట్టమొదటి బహుమతినిచ్చిన ఒకటో తరగతి అయ్యవారికి. స్కూల్లో చేరిన ప్రతి పిల్లవాని పుట్టినరోజు పండుగకూ మాపంతుళ్ళు ఐదేళ్ళైతే ఐదు , ఆరేళ్లైతే ఆరు మొక్కల చొప్పున ఇచ్చి ఇళ్ళలో పెంచమని కోరేవాళ్ళు. వాళ్ళు అలా నాకు ఇచ్చిన ఐదు మొక్కల్నీ నా బదులు మా బామ్మ, అమ్మ నాటారు. వాళ్లకి కృతజ్ఞుడిని.

ఇప్పుడు మా బాదం చెట్టుకు పదేళ్ళు. మేం కావలసినన్ని బాదం పండ్లు తింటాం; బాదం ఆకుల విస్తళ్లలో ఫలహారాలు చేస్తాం . అరటి ఆకులు భోజనం చేయను వాడుకుంటాం. ఎంగిలి ఆకులను మా ఆవులు గేదెలు తింటాయి; మా దొడ్లో రాలిన ఆకులన్నీ చిమ్మి, గుంట త్రవ్వి, లోపల వేసి, మట్టికప్పితే గొప్ప 'పచ్చి రొట్ట ఎరువు ' తయారవుతుంది. మా పూలమొక్కలకూ, కూరపాదులకూ ఆ ఎరువునే వేస్తాం. మా తోటలో పండే కూరలు, ఆకుకూరలు, పండ్లు, పూలు- వేటికీ

రసాయన ఎరువులు అవసరం కాలేదు.

మా వంట ఇంటి గుమ్మం ముందు మా బామ్మ నాటిన బాదంచెట్టు పెద్ద పెద్ద ఆకులతో కొమ్మలతో విస్తరించి ఉంది. తన వెడల్పాటి ఆకులను అడ్డుగా ఉంచి వంటగదిలోకి దుమ్ము ధూళి రాకుండా అడ్డుకుంటుంది అది. నేను నాలుగో తరగతిలో ఉండగానే, మరిన్ని మొక్కలు నాటటంకోసం మా పెరటి పక్క స్థలాన్ని కొనేశారు మానాన్నగారు. 108 చెట్లతో ఈరోజున మాతోట ఇంత అందంగా ఉందంటే, దానికి పెద్దల ప్రోత్సాహం, వాళ్ల సహాయ సహకారాలే కారణం. మా ఇంట్లో వాడే నీరంతా కాలువలద్వారా అన్ని చెట్లకూ మళ్ళేలా సిమెంటుకాలువలు కట్టించారు మానాన్నగారు. మా నూతి వద్ద పడ్డ ప్రతి నీటి-బొట్టూ ఏదో ఒక మొక్కకు అందవలసిందే! అందుకే పెద్దల సహకారం పిల్లలకు అవసరమని చెప్పాను.

ఇక, మా తోటలో కాసే పూలకోసం తుమ్మెదలు, పండ్లకోసం అనేక రకాల పక్షులు, వచ్చి చేరుతాయి. రోజూ మేం కోయిలల కుహూ రావాలతో నిద్రలేస్తాం, చిలుకల పాటలు వింటూ పనులు చేసుకుంటాం, కాకమ్మలు మేం పెట్టే అన్నపు మెతుకులకోసం కాచుకుంటాయి.

మేమంతా రోజూ కనీసం ఒక్క గంట సేపైనా తోటపని చేస్తాం- అందువల్ల మా శరీరాలు గట్టిపడ్డాయి. ఆరోగ్యాలు బావున్నాయి. డెభ్భై ఏళ్ళ మా బామ్మ సైతం మాతో పాటు పనిచేస్తుంది. ఆ వయస్సులో సహజంగా వచ్చే వ్యాధులేవీ ఆవిడకు లేవు.

మేం తినటమే కాదు; మా చుట్టు పక్కలవాళ్ళకీ, మా బడి పంతుళ్ళకూ అందరికీ మా తోటలో పండిన కూరలు పంచి పెడతాం. చాలామంది మా నాన్నగారికి చెప్పారట- కూరగాయల్ని, పండ్లని పట్టణానికి పంపి అమ్మమని. అమ్మితే డబ్బు వస్తుంది- కాని, మేము కూరలు, పండ్లు, మొక్కలు బహుమతిగా ఇచ్చినపుడు మా స్నేహితుల ముఖాల్లో కనిపించే ఆనందం ఎన్ని వేలు పెట్టి కొంటే దొరుకుతుంది మాకు, చెప్పండి!?

మా ఇంటి చుట్టూ చెట్లు ఉండటం వల్ల

వేసవిలో మాకు ఎండ వేడి లేనే లేదు. మా ఇంట్లోకి దుమ్మే రాదు. సాయంకాలాల్లో మా తోటను చూసేందుకు అనేక మంది వస్తుంటారు. వాళ్ళను మేము ఉత్తచేతులతో పంపనే పంపం. మా ఇంటి బొండు మల్లెలకోసం వీధి వీధంతా ఎదురు-చూస్తుంటుంది. ఊరి గుళ్ళల్లో దేవుళ్ళకు మా ఇంటి పూలతో కట్టిన మాలలు అలంకరిస్తారు- ఇంతకంటే గొప్ప ఆనందం ఏముంటుంది?

ఇంటి తోటవల్ల నేను పొందిన ఈ అనుభవం నా జీవన ధ్యేయాన్ని నిర్దేశించింది. నేను వ్యవసాయశాస్త్రం చదవాలనుకుంటున్నాను.

అందరికీ మరోసారి వందనాలు. నా కోరిక కాదనక, అంతా మా తోటకు వచ్చి అక్కడ పండిన మామిడిపండ్లు , పనస తొనలు తిని వెళ్ళమని మనవి " అని ముగించాడు చంటి.

అంతా చప్పట్లు కొట్టారు. సభకు విచ్చేసిన కలెక్టరుగారు చంటిని అభినందిస్తూ అప్పటికప్పుడు వాడికి 'బాల రైతు' బిరుదు, బంగారు పతకమూ బహుమతిగా ఇచ్చారు!

అదండీ పిల్లలూ, 'చంటిగాడి పండ్లతోట' కథ! మరి మీరు కూడా మీ ఇళ్ళలో పండ్లచెట్లు పెంచుతారు కదూ!

అందమైన సూక్తి అరుణోదయంబట్లు
బాల మానసముల మేలుకొల్పు
సూక్తిలేని మాట శృతిలేని పాటరా
లలిత సుగుణజాల! తెలుగుబాల!

-కరుణశ్రీ కీ.శే. జంధ్యాల పాపయ్య శాస్త్రి

రాక్షసుడే నయం!

రచన: యు.రాజశేఖర్, గణిత ఉపాధ్యాయుడు, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నేకొత్తపల్లి.

తిరుపతి తిరునాళ్ళలో వేషాలు వేయడానికి నలుగురు కళాకారులు అనంతపురం నుండి బయలుదేరారు, కారులో. కొంచెం దూరం ప్రయాణం చేశాక, ఓ చెట్టు క్రింద కారును ఆపి విశ్రాంతి తీసుకుంటూ వాళ్ళ వాళ్ళ వేషాల గురించి మాట్లాడుకుంటున్నారు.

అదే తిరునాళ్ళకు వెళ్తూ అప్పటికే అక్కడ విశ్రాంతి తీసుకుంటున్న నాగయ్య ఆ నలుగురు కళాకారులను పలకరించి, 'ఏ ఏ వేషాలు వేస్తున్నారయ్యా, మీరు?' అని అడిగాడు కుతూహలంతో.

"త్యాగానికి మారుపేరైన 'శిబి చక్రవర్తి' వేషం వేస్తున్నాను నేను" అన్నాడు మొదటివాడు.

"దానగుణానికి పెట్టిన పేరైన 'కర్ణుడి' వేషం వేస్తున్నాను" అన్నాడు రెండోవాడు.

"ఆడినమాట తప్పని 'సత్యహరిశ్చంద్ర' వేషం

వేస్తున్నాను నేను" అన్నాడు మూడోవాడు.

ఇక నాలుగో కళాకారుడు మాత్రం ఏమీ చెప్పకుండా ఊరికే ఉన్నాడు.

"ఏమి, ఈ నాలుగో కళాకారుడు ఏమీ చెప్పట్లేదు? ఈయన వేషం ఏంటి?" అడిగాడు నాగయ్య.

మొదటి ముగ్గురు కళాకారులూ వెటకారంగా నవ్వారు. "వీడి వేషం గురించి వీడు ఏం చెప్పుకుంటాడు, మమ్మల్నడుగు- చెబుతాం. 'మనుషుల్ని తినే బ్రహ్మ రాక్షసుడి వేషం' వేస్తున్నాడు వీడు!" అన్నారు ఇకిలిస్తూ.

మధ్యాహ్నం కాగానే నలుగురు కళాకారులూ భోజనం చేయడానికి కూర్చున్నారు.

ఇంతలో ఒక ముష్టివాడు వాళ్ళదగ్గరికి వచ్చాడు- మొదటి వాడిని (శిబిచక్రవర్తి) అడిగాడు "అయ్యా! నాలుగు రోజులుగా తిండిలేదు, కనికరించి కొంచెం అన్నం పెట్టండి బాబూ" అని.

"అబ్బా! ఎక్కడికి వెళ్ళినా ఈ ముష్టివాళ్ళగోల- భరించలేక పోతున్నాను. వెళ్ళవయ్యా!" అని కసురుకున్నాడు శిబి చక్రవర్తి.

రెండవ వాడి(కర్ణుడు) దగ్గర చెయ్యి చాచాడు ముష్టివాడు- "కొంచెం అన్నం పెట్టండి బాబయ్యా" అని. "నీ కోసం కాదు, ఈ అన్నం తెచ్చింది- మా కోసం! ఇది మాకే చాలకొచ్చేట్లుంది పోవయ్యా!" అరిచాడు కర్ణుడు.

పట్టు వదలని ముష్టివాడు మూడవ వాడిని (సత్యహరిశ్చంద్ర) "ఆకలిగా ఉంది- కొంచెం అన్నము పెట్టండి " అని అడిగాడు. "అన్నం లేదు సున్నం లేదు-పోవయ్యా " అన్నాడు హరిశ్చంద్రుడు.

నాల్గవ వాడు (రాక్షసుడు) తనుతినే

ఆహారంలో కొంత తీసి ఆ ముష్టివాడికి పెట్టాడు.

'దయగల మారాజువు- చల్లగా ఉండు నాయనా!' అని వెళ్ళిపోయాడు ముష్టివాడు.

ఇదంతా గమనిస్తున్న నాగయ్య, పగలబడి నవ్వాడు. "రాక్షసుడే మేలు గదయ్యా" అని.

"ఏమట్లా?" అని అడిగిన కళాకారులకు చెప్పాడు- "మీరు వేస్తున్నది మహానుభావుల వేషాలే కావొచ్చు- అయితేనేమి? అవి వేషాలే. వాటి వెనక ఉన్న మీ నిజరూపాలకు, ఆ మహానుభావుల లక్షణాలకూ ఏమాత్రం పోలిక లేదు. దయాపరులైనవారి వేషాలు వేయబోతున్న మీరు నిజ జీవితంలో నిర్దయులే. మీతో పోలిస్తే ఆ బ్రహ్మ రాక్షసుడే నయం. నిజ జీవితంలో కనీసం మనిషిలాగానైనా ప్రవర్తించాడు!" అని.

"మంచి వేషాలు వేయగానే సరిపోదు, మంచి గుణాలు కూడా ఉండాలి" అని నాగయ్య అంటుంటే ముగ్గురు కళాకారులూ వెఱ్ఱి మొహాలు వేశారు.

కుతూహలం!

టీచర్: సూదితో గుచ్చితే రక్తం బయటకు ఎందుకు వస్తుంది చిన్నీ?

చిన్ని: ఎవరు గుచ్చారో చూద్దామని టీచర్!

తెలివి-బలం

రచన: శ్రీమతి రాధ మండువ, ఉపాధ్యాయిని, రిషివ్యాలీ స్కూలు, మదనపల్లి.

మొలకవారిపల్లెలో రాముడు, భీముడు అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. రాముడు చాలా తెలివైనవాడు. ఏ పనైనా తెలివిగా ఆలోచించి చేస్తాడు. భీముడేమో, మంచి భుజశక్తి ఉన్నవాడు. ఏ పని ఇచ్చినా కష్టపడి చేయగలడు.

'తెలివి ఉంటే ఏ పనైనా సాధించగలం' అనేవాడు రాముడు . 'ఏ పని సాధించాలన్నా భుజశక్తి ఉండాలి' అనేవాడు భీముడు ! ఈ విషయంలో మటుకు ఇద్దరికీ గొడవ అవుతుండేది. అయినా మొత్తంమీద ఇద్దరూ చాలా మంచి స్నేహితులే.

పెద్దయ్యాక రామయ్య భీమయ్యలు వాళ్ళ వాళ్ల మనస్తత్వానికి తగిన వృత్తులనే ఎన్నుకున్నారు. రామయ్య వ్యాపారం, భీమయ్య వ్యవసాయం చేపట్టారు. ఇద్దరూ బాగా పైకి వచ్చారు కూడా. రాముడికి ఒక కూతురు, భీముడికి ఒక కొడుకు.

తమ చిన్ననాటి స్నేహాన్ని బంధుత్వంగా మార్చుకుందామనుకున్నాడు భీమయ్య. రామయ్య కూతురినే తన కోడలుగా చేసుకోవాలని అనుకొని రామయ్యకు కబురంపాడు. రామయ్య కూడా అందుకు ఎంతో సంతోషించాడు. మంచి ముహూర్తం నిర్ణయించుకుని నిశ్చితార్థం ఏర్పాటు చేయాలనుకున్నాడు. అదే సంగతి ఊరి పెద్దలకూ చెప్పేందుకని పంచాయితీ ఆఫీసుకి వెళ్ళాడు రామయ్య. గ్రామాధికారి, ఇతర పెద్దలు అందరూ రామయ్య స్నేహితులే మరి!

అదే ఊళ్లో పంచాయతీ గుమాస్తా చలమయ్య. చలమయ్యది వక్రబుద్ధి. వాళ్ళ మాటలు వీళ్ళకు, వీళ్ళ మాటలు వాళ్ళకు చెప్పడం, స్నేహితుల మధ్య తగాదాలు పెట్టడం- ఇవి చలమయ్యకు చాలా ఇష్టం. చలమయ్యకి కూడా ఒక కూతురు ఉంది. ఆ అమ్మాయిని భీమయ్య కొడుక్కిచ్చి పెళ్ళి చేయాలని కొంతకాలంగా కలగంటున్నాడు చలమయ్య. ఇప్పుడు ఈ సంగతి వినగానే అసూయతో అతని కడుపు రగిలిపోసాగింది. ఎలాగైనా ఈ సంబంధాన్ని చెడగొట్టి, 'భీమయ్య కొడుక్కి తన కూతుర్నిచ్చి పెళ్ళి చెయ్యాల్సిందే' అనుకున్నాడు చలమయ్య.



ఆ రోజు సాయంత్రమే అతను భీముడి ఇంటికి వెళ్ళి "భీమయ్యా! నీ కొడుక్కి రామయ్య కూతురిని అడిగావుటగా!? పంచాయితీ ఆఫీసు దగ్గర ఆ రామయ్య ఏం మాట్లాడుతున్నాడో తెలుసా?!" అన్నాడు.

"ఏమన్నాడు?!" ఆశ్చర్యంగా అడిగాడు భీమయ్య.

"ఆఁ! ఏమంటాడా?! 'గొడ్డులాగా కష్టపడటం తప్ప భీమయ్యకు కాస్తంత కూడా తెలివి లేదు; వాడి కొడుకు కూడా

అలాంటివాడే. అట్లాంటి మొద్దుకు నా కూతుర్ని ఇవ్వాలా వద్దా- అని ఆలోచిస్తున్నాను' - అని అందరితో చెప్తున్నాడు చూడు!" అన్నాడు చలమయ్య.

రామయ్య చిన్ననాటి నుండీ భీమయ్యను తమాషాగా ఇలాగే ఆటపట్టిస్తూ ఉండేవాడు- కాబట్టి 'చలమయ్య చెప్పింది నిజమే అయి ఉంటుంది' అనుకున్నాడు భీమయ్య. మర్నాడు ముహూర్తం పెట్టుకోవడానికి వచ్చిన పెద్ద మనుష్యులతో "పంచాయితీ ఆఫీసు దగ్గర ఆ రామయ్య మీతో ఏం మాట్లాడాడో మీకు కూడా తెలుసు కదా; మళ్ళీ ఏం ముఖం పెట్టుకుని ముహుర్తాలు పెట్టుకోవడానికి వచ్చారు?" అంటూ విస విసా లోపలికి వెళ్ళిపోయాడు.

జరిగిన విషయం రామయ్యకి చెప్పారు పెద్దమనుషులు. 'పంచాయితీ ఆఫీసు దగ్గర' అన్నాడు కదా, భీమయ్య? ఆ వాక్యం అధారంగాఏం జరిగి ఉంటుందో ఊహించాడు రామయ్య. ఇదంతా చలమయ్య పని అని గుర్తించాడు. చలమయ్య మనసులో ఉన్న దుర్బుద్ధిని కూడా తెలివైన రామయ్య కనిపెట్టాడు.

వెంటనే అతను గ్రామాధికారి దగ్గరకు వెళ్ళి, తన అనుమానం వివరించి, సహాయం చేయమని కోరాడు. గ్రామాధికారి వెళ్ళి భీమయ్యతో మాట్లాడేసరికి చలమయ్య దుష్టత్వం బయట పడ్డది.

వెంటనే భీమయ్య కోపంతో చలమయ్య ఇంటికి వెళ్ళి "నిజంగా జరిగినదేమిటో చెప్తావా, లేదా?!" అని గట్టిగా అరుస్తూ చలమయ్య మీదికి చెయ్యెత్తాడు.

"క్షమించు భీమయ్యా! దుర్బుద్ధితో నీకు చెప్పుడు మాటలు చెప్పాను!" అంటూ భీమయ్య కాళ్ళ మీద పడ్డాడు చలమయ్య. తేరుకున్న భీమయ్య అప్పటికప్పుడే రామయ్యని, పెద్దమనుషులని పిలిపించి ముహుర్తం పెట్టుకున్నాడు.

"చూశావా! తెలివితో చలమయ్య పని పట్టించాను!" అన్నాడు రామయ్య భీమయ్యతో.

"ఆ!! సరేలే! నీ తెలివితోనే పని అయిందా? గట్టిగా బెదిరిస్తూ చెయ్యెత్తితే గాని నిజం బయటికి రాలేదే?!" అన్నాడు భీమయ్య.

"నేను చెప్పిందే రైటు అని అనుకోవడం వల్ల, 'అది తప్పు-ఇది రైటు' అంటూ ఏర్పరచుకునే పనికిరాని అభిప్రాయాల వల్లనే మనుషుల మధ్య వైషమ్యాలు ఏర్పడుతున్నాయి. మీ అభిప్రాయ భేదాల వల్లనే కదా, బంగారం లాంటి మీ స్నేహం పాడవబోయింది? ఇకనైనా ఇలాంటి వ్యర్థ వాదనలు మానండి!" అన్నాడు గ్రామాధికారి గంభీరంగా.

అంగీకరించినట్లు, సిగ్గుగా నవ్వారు రామయ్య-భీమయ్యలిద్దరూ.

చిలిపి ప్రశ్నలు

1. ఇదివరకైతే "ఓ కార్డు ముక్క రాస్తే చాలు!" అనేవారు. మరిప్పుడు!?

 జవాబు: "మిస్డ్ కాలు ఇస్తేచాలు"

2. ఆధునిక భస్మాసురులు ఎవరు!?

 జవాబు: తాము ప్రయాణించే బస్సులు తామే తగలబెట్టుకునేవాళ్ళు.

3. బయట వుండే వాయువు శరీరంలో వుంటే....!?

 జవాబు: ఆయువు.

4. సోమరిపోతును ఎవరైనా 'చావరాదా' అని తిడితే...!?

 జవాబు: 'బద్ధకంగా వుంది బాబూ' అంటాడు.

సేకరణ: శ్రీవివియస్ మూర్తి, చొదిమెళ్ళ.

పులి- చిలుక

ఆంగ్లమూలం: సహానా, బెంగలూరు. *తెలుగుసేత: నారాయణ, కొత్తపల్లి బృందం*

ఆధారం: telugu4kids.com *వారు కొత్తపల్లి కోసం గతంలో అందించిన పులి-చిలుక చిత్రం*

పడమటి కనుమల్లోని దట్టమైన అడవిలో, ఒక రోజున.. అంతకు ముందెన్నడూ కానరాని పంచవన్నెల రామ చిలుక ఒకటి- ఆశపోతు పులి కంటపడింది.

సుదూరంగా ఉన్న దక్షిణ అమెరికా నుండి వచ్చినట్లుంది- నిండైన రంగులతో కనుల-పండువ చేస్తున్నదా చిలుక.

"అద్భుతం! అసాధారణం! ఇలాంటి పక్షి ఈ అడవికి క్రొత్త అయిఉండాలి. నేను చిన్నగా ఉన్నప్పుడెప్పుడో ఇట్లాంటి పక్షినొకదాన్ని చూసినట్లు గుర్తు..మళ్ళీ ఇన్నేళ్లకు.." .. పిట్ట పులికి అందనంత ఎత్తులో చెట్టు మీద వాలి ఉన్నది.

అకస్మాత్తుగా రామచిలుక అరిచింది- అడవిలోని నిశ్శబ్దంలోంచి ఆ అరుపు దూర-దూరాల వరకూ దూసుకుపోయింది.

అప్పటివరకూ "క్రిచ్, కిరిచ్, క్రిచ్, కిరిచ్" అంటున్న కీచురాళ్ళుకూడా ఆ ఒక్క అరుపుతో నిశ్శబ్దంలో కూరుకుపోయాయి.

"ఉం...హుం... ఇప్పుడు గుర్తొచ్చింది.." అనుకున్నది పులి " నేను దీన్ని ఇంతకు ముందు చూసింది ఇక్కడ కాదు- మనుషుల ఇంట్లో! అప్పుడోసారి నేను తిరుగుతూ తిరుగుతూ మనుషులుండే చోటుకు దగ్గరగా వెళ్ళాను..అప్పుడీ చిలుక కూడా వాళ్ల లాగానే మాట్లాడుతూ ఉన్నది! బదులుగా వాళ్ళు దానికి ఏదో తిండి తినిపిస్తున్నారు! 'ఎంత తెలివైన పిట్టో చూడు, ఇది!' అనుకున్నది తను- అప్పుడు!"

చిలుక "క్రీచ్...!" అని మరోసారి అరిచేసరికి పులి తన ఆలోచనల్లోంచి మళ్ళీ ఈ ప్రపంచంలోకి వచ్చింది. దానికి ఉత్సాహం వేసింది- చూస్తుంటే ఈ పిట్ట 'దారి తప్పినట్లు, ఎటు పోవాలో తెలీక మధన పడుతున్నట్లూ తోస్తున్నది. ఈ ఈకల కుప్పని మినహా-యించుకొని చూస్తే.. ఇదేదో మంచి రుచికరమైన టిఫినే అయ్యేట్లుంది!

పులి మెల్లగా చిలుక వైపుకు కదిలింది. అయితే అదే చెట్టుమీద కూర్చున్న కోతి దాన్ని చూసేసింది అప్పుడే. "ఊంఫ్..ఫ్.. ఊంఫ్..ఫ్.. ఊంఫ్..ఫ్" అని ముందుగానే హెచ్చరికలు జారీ చేసేసింది చిలుకకు.

కోతి అరుపులు వినగానే చిలుక అటు తిరిగి చూసింది: నలుపు-పసుపు చారల పెద్ద పులి! మెల్లగా నడుచుకొని వస్తోంది తనవైపే!

"హేయ్! హల్లో! కులాసానా?" అరిచిందది, భయం భయంగానే, పులిని చూస్తూ.

నడుస్తున్నదల్లా ఆగిపోయింది పులి. తలపైకెత్తి చిలుకకేసి చూస్తూ అన్నది- "ఎందుకు, నువ్వు మనుషుల లాగా మాట్లాడు-తున్నావు?" అని.

“ఎందుకంటే నాకు ఆహారందొరుకుతుంది కనుక- మనుషులంటే నాకు చాలా ఇష్టం కనుక!” అన్నది పంచవన్నెల రామచిలుక.

“ప్చ్.చ్..చ్..చ్. వాళ్ళు నీకు తిండి పడేస్తారు కనుక! అంతే!! వాళ్ళు నీకు కాసింత తిండి పడేస్తారు కనుక, నీకు వాళ్లంటే ఇష్టం. అంతే!” దాన్ని ఉడికిస్తూ అన్నది పులి, అదే సమయంతో తన పంజాని విదిల్చి దాన్ని అందుకునేందుకు ప్రయత్నిస్తూ.

రామచిలుక పై కొమ్మమీదికి ఎగిరి కూర్చున్నది లేచి నిలబడ్డ తన ఈకల్ని ముక్కుతో సరి చేసుకుంటూ అన్నది: ”వాళ్ళు నేను ఉండేందుకొక నివాసం కూడా ఇస్తారు!” అని.

ఇలా మాట్లాడుతూ వేటాడటం పులికి బాగా నచ్చింది. 'చిలుక అలిసి పోయేంతవరకూ దాన్ని ఒక కొమ్మ మీదినుండి మరో కొమ్మ మీదికి దూకిస్తూ ఉంటే బాగుండేట్లుంది..'

పైకి అన్నదది, చిలుకతో- “అడవిలో కూడా నివాసాలు ఉన్నాయి! మరి అవన్నీ నాకు ఉచితంగానే దొరుకుతున్నాయి- ఏ మనిషీ వాటిని నాకు దానం చెయ్యనక్కర్లేదు!” అని, కొద్దిగా చేతులు చాచి పైకి ఎగురుతూ.

"పులిని ఆలోచనల్లో ఉంచితే తప్ప, నేను తప్పించుకునేందుకు వీలయ్యేట్లు లేదు-” అనుకున్నది చిలుక. పైకి అన్నది-”కనీసం అక్కడ నీలాంటి క్రూరజంతువులనుండి రక్షణ అయితే ఉంటుంది!” అని. అట్లా అనగానే ఎగిరి మరో కొమ్మ మీద వాలింది.

“హుప్..!” అన్నది పులి, మరోసారి పైకి ఎగిరి దూకుతూ, చిలుకను అందుకునేందుకు ప్రయత్నిస్తూ. 'మళ్ళీ తప్పించుకుంది!' అని మనసులోనే కోపగించుకుంటూ.

“వాళ్ళు అక్కడ నీకిచ్చే నివాసం అడవిలో భద్రంగా ఉండటం ఎలాగో నేర్పదు” అన్నది అక్కసుతోటి, మరోసారి చిలుకను అందుకునేందుకు ప్రయత్నించి విఫలమౌతూ.

“అక్కడ వాళ్ళు నన్నెంతో అభిమానిస్తారు! అందరూ నన్ను ఎంతో మెచ్చుకుంటూ ఉంటారు!” వాదించింది చిలుక, అక్కడి- నుండి ఎగిరి, ఎండిపోయి నిలబడ్డ ఒక మొద్దు మీద వాలుతూ.

"అభిమానించటం అంటే ఏంటి? ఆ అభిమానం నీకు ఎందుకు?" అడిగింది పులి "బ్రతికేందుకు అది అంత అవసరమా?"

"ప్రేమించబడటం అనేది చాలా బాగుం-టుంది!" అన్నది చిలుక, ఎగిరి మరింత దూరంగా వాలేందుకు శ్రమపడుతూ.

"అవునవును. బాగుంటుంది. అయితే బోనులో పెట్టి బంధించేశాక ఇంక ఆ ప్రేమను ఏం చేసుకుంటాం?" అన్నది పులి.

"అంతేకాదు; నీకు నీలాకాశంలో స్వేచ్ఛగా విహరించటం అంటేనూ, పచ్చటి అడవిలో సంతోషంగా ఎగరటం అంటేనూ అసలు తెలీనే తెలీదు!" అన్నది, దగ్గరలో ఉన్న ఒక చెట్టు బెరడును బరబరా గోకి, తన గోళ్లకు పదును పెట్టుకుంటూ.

"అడవిలో ఎగరటమా..? కానీ-.. కానీ-.. నాకు అసలు ఎగరటమే రాదు!" అణచి-పెట్టుకున్న ఆవేదనను ఒక్కసారిగా వెళ్లగక్కింది పంచవన్నెల రామ చిలుక. అలా అరవటంలో అది తను నిలబడ్డ కొమ్మ మీదినుండి దూరంగా ఉన్న ఇంకొక కొమ్మ మీదికి దూకింది బలంగా.

కలగాపులగమైన తన ఈకల్ని మరొకసారి సర్దుకుంటూ అది లోతుగా ఆలోచించింది. అటుపైన విచారంగా అన్నది- "ఊహ తెలిసిన నాటి నుండీ నేను పంజరాల్లోనే ఉన్నాను. పెద్ద పెద్ద పంజరాలు; కాకపోతే చిన్న పంజరాలు. నేను పుట్టిందే ఒక పంజరంలో! కొంచెం దూరం కూడా సొంతగా ఎగిరి పోవలసిన అవసరం కలగలేదు నాకు ఏనాడూ! నా ప్రతి అవసరాన్నీ మనుషులే తీర్చారు; మంచి తిండి పెట్టారు. నేను చేయాల్సిందల్లా ఏవో కొన్ని చిన్న చిన్న కిటుకులు నేర్చుకోవటం; వాటితో వాళ్ళ మనసులకు సంతోషం కలిగించటం. నా పంజరంలో నాకు చక్కని భద్రతా భావం ఉండేది. దానిలోనుండి బయటికి రావటం ఇదే మొదటిసారి, నాకు. జీవితంలో మొదటిసారి నిలబడ్డాను నేను- ఇలా.. - ఈపొదల మధ్య, చెట్ల మధ్య, ఘోరమైన అడవిలో, నన్ను తినేందుకు పూనుకునే క్రూర జంతువులకు ఎదురుగా! 'తర్వాతి భోజనం ఎలాగ?' అని నేను ఇప్పుడే

ఆలోచిస్తున్నాను- అదికూడా నా జీవితంలో మొదటిసారి! నేను ఇన్నాళ్ళూ నేర్చుకున్న కిటుకులు ఏవీ కూడా నాకు ఇక్కడ ఒక్క వేరుశనగపప్పునూ తెచ్చిపెట్టవు!"

"బాధపడకు, మిత్రమా! నీ ప్రియమైన మనుషుల్ని నువ్వు త్వరలో కలుసు-కుంటావులే. ఇంత సేపూ నేను ఎంత ప్రయత్నించినా నువ్వు నాకు దొరకలేదు- బ్రతికి పోయావు. ఇక నువ్వు ఇప్పుడు చెయ్యాల్సిందల్లా అదిగో- ఆ వెదురు పొదల మీదినుంచి ఎగరటం. అవి దాటావంటే నువ్వు నీ మనుషుల మధ్య ఉంటావు. పో! ఎగురు ఇంక!" అన్నది పులి, వెనక్కి తిరుగుతూ.

రామచిలుకకి నోట మాట రాలేదు. పులి మాటలు నమ్మ శక్యం కాలేదు. కానీ అంతలోనే దానికి మనుషుల గొంతులు, వాళ్ళ అరుపులు, చప్పట్లు, వాళ్ళు నడచి వస్తున్న శబ్దాలు వినబడ్డాయి. "ఓహ్... సుపరి-చితమైన మనుష్యస్వరాలు! "

చెట్టు క్రింద పులి నిశ్శబ్దంగా నడచి పోతున్నది... ఎండిన గడ్డి లోంచి, ఆకుల మధ్యలోంచి- అక్కడ పరచుకున్న వెలుగు నీడల పందిరిలో కరిగిపోతూ. "ఓహ్! చారలు ఉన్నది అందుకే అన్నమాట!" అనుకున్నది చిలుక, దానికేసే అబ్బురంగా చూస్తూ.

ఇప్పుడు గొంతులు మరింత గట్టిగా వినబడుతున్నాయి. చిలుక మళ్ళీ పంజరంలోకి చేరుకోవాలి ఇంక.

రేగుపళ్ళ రుచి

వాల్మీకి రామాయణంలో వచ్చే శబరి కథ అసలు ఇలా లేనే లేదట! అంటే మనం దీన్నీ చదవచ్చు, దాన్నీ చదవచ్చు- రెండు వేరు వేరు కథలు!!

మూలం: పర్తాప్ అగర్వాల్ తెలుగు అనుసరణ:నారాయణ, కొత్తపల్లి బృందం

శ్రీరాముడు, ఆయన తమ్ముడు లక్ష్మణుడు- ఇద్దరూ సీతమ్మను వెతుక్కుంటూ తిరుగుతున్నారు అడవిలో. సీతమ్మనేమో రావణాసురుడు ఎత్తుకుపోయి లంకలో దాచిపెట్టాడు. కానీ రాముడికి, లక్ష్మణుడికి ఇంకా ఆ సంగతి తెలీదు. ఇద్దరూ ఆత్రంగా వెతుకుతూ పోతున్నారు- ప్రతి చెట్టునూ, పుట్టనూ శోధిస్తూ.

అంతలో దూరంగా చిన్న చిన్న గుడిసెలు కనబడ్డాయి. అక్కడేదో ఊరు ఉన్నట్లుంది. 'ఊళ్లోకెళితే సీతమ్మను గురించి అడగొచ్చు.. అట్లాగే ఏమైనా కొంచెం తినేందుకు దొరకచ్చు, కొంచెం సేపు విశ్రాంతి తీసుకోవచ్చు' అనిపించి అటువైపుకు నడిచాయి వాళ్ల పాదాలు.

ఇంకా ఊళ్లోకి ప్రవేశించకనే ఒక గుడిసె కనబడింది. చిన్న గుడిసె- ముందొక చక్కని పూలతోట. కంచె చుట్టూతా అల్లుకున్న తీగలు, శుభ్రంగా ఊడ్చి కళ్లాపుచల్లిన లోగిలి.

వాళ్లు ఆ గుడిసె ముందు నుంచి పోతుండగా, వాకిలి దగ్గరే నిలబడ్డ ముసలవ్వ ఒకామె కళ్లపైన చేతులు అడ్డు పెట్టుకొని చూసింది- 'ఎవరు వీళ్లు?' అన్నట్లు.

గబగబా పరుగెత్తుకొని వచ్చి వీళ్లముందు నిల్చున్నది. రాముడి కళ్లలోకే చూస్తూ ఆయన చేతులు పట్టుకొని నిలబడ్డది. పరుగున వచ్చిన ఆయాసం వల్ల కావచ్చు, ఆమె కాళ్లు వణుకుతున్నాయి. ముసలితనం వల్ల చేతులు కూడా వణుకుతున్నాయి. చికిలించిన కళ్లలోంచి, అవి వెలుగునిచూడలేకనేమో- ధారాపాతంగా నీళ్లు కారుతున్నాయి.

"నువ్వు నా దేవుడివే కదూ? నా రాముడివే కదూ? ఈ శబరిని చూసిపోదామని వచ్చావు కదూ? ఎంత దయ స్వామీ, నీకు? కాళ్లకి చెప్పులు కూడా లేకుండా నడిచి వస్తున్నావా, నా కోసం? ఎన్ని ముళ్లు గుచ్చుకున్నాయో పాపం!" అంటూ రాముడి కాళ్లమీద పడ్డది శబరి- ఎట్లా గుర్తు పట్టిందో మరి, రాముడిని!

రాముడు ఆమెను పైకి లేవనెత్తి అన్నాడు "అమ్మా! పెద్దదానివి, నా కాళ్లకి నువ్వు నమస్కరించటం ఏమిటి? నీ కొడుకులాంటి

వాడిని కదూ? నేనే నీకు నమస్కరించాలి కదా?" అని.

శబరి కళ్లలో ఎన్ని నీళ్లు నిండాయంటే ఆమెకిక వేరే ప్రపంచం ఏమీ కనిపించలేదు. ఆనందంతోటి ఉబ్బి తబ్బిబ్బైపోయిన ఆ తల్లికి ఏం మాట్లాడాలో తోచలేదు, ఏం చెయ్యాలో కూడా గుర్తుకు రాలేదు. రాముడిని నేలమీదే కూర్చోబెట్టింది. తను ఆయన ఎదురుగా కూర్చున్నది. ఆయన్నే పట్టుకొని తడిమింది కొంతసేపు.

ఆ పైన కొంచెం తేరుకొని అన్నది "నాయనా! నాకెంత సంతోషం కలిగిందో చెప్పలేను- నేను ఇన్నేళ్లుగా ఎదురుచూస్తున్న దైవం ఈ రోజున నా ముందుకు నడిచి వస్తుందని ఉదయం నుండి ఎందుకో, అనిపిస్తూనే ఉన్నది. చూడు! నా ఊహ నిజమైంది. నువ్వు నా ఇంటికే వచ్చావు నేరుగా. నా జీవితంలో ఇది ఇక మరచిపోలేని రోజు. రా,రా! ఇంట్లోకి రా! కొంచెం సేపు నా గుడిసెలో విశ్రాంతి తీసుకుందువు. కాళ్లు-చేతులు కడుక్కో. నీళ్లున్నాయి ఇక్కడ-ఇదిగో, తాగేందుకు నీళ్ళు. నేను ఇప్పుడే గబగబా వెళ్లి కొన్ని పళ్లు కోసుకొస్తాను మీకోసం. పాపం ఎప్పుడు తిన్నారో, ఏమో!

మంచి రేగుపళ్ల (రేణికాయల) కాలం కదా, అడవి నిండా రేగుపళ్లు ఉన్నై. నేను ఇట్లా పోయి అట్లా వచ్చేస్తాను కూర్చోండి-" అని హడావిడి పడ్డది.

రాముడు ఆమెను వారించే లోగానే బుట్ట చేతబట్టి బయటికి పరుగెత్తింది శబరి. "తన

దేవుడు నడచి వచ్చాడు, తన ఇంటికి! దేవుడికి ఆకలిగా ఉంది. తినేందుకు రేగుపళ్లు కావాలి."

తియ్యటి పళ్లు ఇచ్చే చెట్లు ఏవో తెలుసామెకు. ఆ చెట్లలో దోరదోరగా మాగిన పళ్లను ఏరి ఏరి కోసింది. బుట్ట నిండగానే అతిథులకు ఇచ్చేందుకని వెనక్కి పరుగు పెట్టింది. ఆ బుట్టను రామలక్ష్మణుల ముందు పెట్టింది. రాముడి ముందు కూర్చున్నది. "తినండి నాయనా! బాగున్నాయి రేగుపళ్లు. తియ్యగా ఉన్నాయిలే, తినండి" అని బుట్టను వాళ్లకి దగ్గరగా జరిపింది.

లక్ష్మణుడు కదలలేదు. రాముడు ఒక పండును చేతిలోకి తీసుకున్నాడు. "అయ్యో! ఒక్కటొక్కటే ఏం తింటావు? అంత నాజూకా? గబగబా తినాలి. నేను తినిపిస్తాను ఆగు" అని బుట్టను తన దగ్గరికి జరుపుకున్నది శబరి. బదులుగా నవ్వాడు రాముడు- కేవలం భగవంతుడే నవ్వగలిగేట్లు, చిరునవ్వు నవ్వాడు.

అకస్మాత్తుగా శబరికి అర్థమైంది- తన దేవుడికి తను తినిపించబోతున్నది! దేవుడు తన చేతితో పెట్టిన రేగుపళ్లు తినబోతున్నాడు! "దేవుడికి ఎట్లా తినిపిస్తారు? మంచి పళ్లే పెట్టాలి! మంచి పళ్లేవో ఎట్లాగ, కనుక్కోవటం? పుల్లటి పళ్లు, వగరుగా ఉండే పళ్ళు రాకుండా చూసేదెలాగ?" తడబడి పోయిందామె మనసు.

చేతులు వాటంతట అవే పళ్లను ఒక్కొక్క దాన్నీ ఆమె నోటికి అందించాయి. ఆమె నోరు ఒక్కో పండునూ కొరికి రుచి చూసింది. బాగున్న పళ్లని ఆమె ఒక్కొక్కటిగా ఇవ్వసాగింది, రాముడికి. రాముడు తింటున్నాడు - శబరి ఎంగిలి చేసి ఇస్తున్న పళ్లని సంతోషంగా చప్పరిస్తున్నాడు!

లక్ష్మణుడి కళ్లు పెద్దవయ్యాయి, యీ ఘోరాన్ని చూసి- "సర్వ ప్రపంచానికే ఏలిక అయిన శ్రీరాముడు శబరి ఎంగిలిని తినటం ఏమిటి?!" కళ్లతోటే సైగలు చేశాడు రాముడికి- తినద్దని. 'ఎంగిలి పళ్లు' అన్నట్లు అసహ్యంగా ముఖం పెట్టి చూపించాడు.

రాముడు తమ్ముడి సైగల్ని అస్సలు పట్టించుకోలేదు. శబరి తన నోటికి అందిస్తున్న రేగుపళ్లని ఇష్టంగా తింటూపోయాడు.



ఆయన ముఖం చూస్తే ఎవరికైనా తెలుస్తుంది- శబరి ఇస్తున్న రేగుపళ్ల రుచి ఆయనకు నిజంగా చాలా నచ్చింది! అమృతం తింటున్నవాడి ముఖం ఎట్లా ఉంటుందో అట్లా ఉంది రాముడి ముఖం!

కొంచెం సేపు ఆయన్ని తేరిపార చూసాక, ఇక చేసేదేమీ లేక లక్ష్మణుడే తల త్రిప్పుకున్నాడు!

శబరికి రాముడి పట్ల ఎంత ప్రేమ కలిగిందో, రాముడికీ శబరి పట్ల అంత ఇష్టం కలిగింది. ఆమె సొంత చేతులతో ఆయనకు తినిపించి సంబరపడితే, ఆయన అమె చేతుల మీదుగా తిన్నందుకు సంతోషపడ్డాడు. తన జీవితంలో ఆనాటి వరకూ అంత రుచికరమైన ఆహారం తినలేదు ఆయన! కడుపు నిండేంత వరకూ తింటూ పోయాడు రాముడు. అటు పైన అంత చక్కని పండ్లని పెట్టినందుకు శబరిని ప్రశంసలతో ముంచెత్తాడు. లక్ష్మణుడు ముఖం మాడ్చుకొని అంతా చూస్తూ నిలబడ్డాడు, ఏమీ అనకుండా.

తర్వాత నెల రోజులకు, వానర రాజు సుగ్రీవుడి ఇంట్లో మంచి విందు ఒకటి జరిగింది. రాముడు, లక్ష్మణుడు ఇద్దరూ బాగా భోంచేశారు, గొప్ప గొప్ప పిండివంటలతో. భోజనాలైనాక లక్ష్మణుడు అడిగాడు- "అన్నా! భోజనం అద్భుతంగా ఉంది, కదూ?" అని.

"బాగుంది బాగుంది" అన్నాడు రాముడు- "కానీ శబరి పెట్టిన రేగుపండ్లంత గొప్పగా అయితే లేదు" అని జోడించాడు.

లక్ష్మణుడికి అర్థం కాలేదు . ఆ తర్వాత వాళ్లు వేరువేరు చోట్ల గొప్ప గొప్ప మహారాజులు పెట్టిన విందు భోజనాలు తిన్నప్పుడల్లా అడిగాడతను అన్నని- "ఈ భోజనం చాలా గొప్పగా ఉంది కదన్నా?!" అని. ప్రతిసారీ, ఆ భోజనం ఎంత అద్భుతంగా ఉన్నాసరే, రాముడు -"శబరి పెట్టిన పళ్లు ఇంకా చాలా బాగున్నాయి" అనే అంటూ వచ్చాడు.

చాలా సంవత్సరాల తర్వాత అర్థమైంది లక్ష్మణుడికి - భోజనాన్ని రుచికరంగా చేసేది దానిలోకి వాడిన నెయ్యి కాదు; అందులో వేసిన జీడిపప్పులు, బాదాములు కాదు- భోజనానికి రుచి ఏర్పడేది ప్రేమ వల్లనే. భగవంతుడు ఇష్టపడేది ఆప్రేమనే!

చిలిపి ప్రశ్నలు-ఏం జవాబులు!

ఇవ్వటానికి ఇష్టపడేది, తీసుకోటానికి ఇష్టపడనిది.....?

జవాబు: సలహా

రిటైరయిన సిటీబస్‌డ్రయివర్ బైక్ మీద కూర్చున్న భార్య విసుక్కునేదెప్పుడు!?

జవాబు: భర్త బైకును ప్రతి బస్‌స్టాపు దగ్గరా ఆపుతున్నపుడు!!

కరిగిపోయినా తరిగిపోనిదేమిటి?

జవాబు: కాలం!!

సేకరణ: శ్రీవివియస్‌మూర్తి, చౌదిమెళ్ళ.

చదువు-పని

రచన: నందన, 5వ తగరతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.

బొమ్మలు: వినయ్.

మనోహర్: అమ్మా! నేను చదువుకుంటానే!

అమ్మ:మనం పేదవాళ్లం నాయనా, మనకెందుకు చదువులు?

చదువు కుంటే మనకు రోజులు గడవ్వు. వద్దు నాయనా.

కానీ, మనోహర్ పట్టు విడవలేదు, చివరికి..

అమ్మ: నువ్వు యీ మూడు నెలలూ ఏదో ఒక దుకాణంలో పని చెయ్యి. కాసిని డబ్బులు జమ అవుతాయి. తర్వాత ఆ డబ్బుతో చదువుకుందువులే; ఊరికే విసిగించకు.



యజమాని: మనోహర్; కిలో కందిపప్పు కట్టు!

మనోహర్: సరేనండి, ఇంకా?

చాలా మనసు పెట్టి పని చేశాడు,అయినా నెలగడిచేసరికి-

యజమాని: ఇదిగో, ఈ జీతం తీసుకొని పో, ఇక రానక్కర లేదు. పాత పిల్లవాడు వస్తానంటున్నాడు మళ్లీ.

మనోహర్: విచారంగా కూర్చొని ఉన్నాడు, దుకాణానికి ఎదురుగా. అంతలో...

అంతలో.. కొందరు దొంగపిల్లలు దుకాణం లోంచి సామాన్లు ఎత్తుకుపోతూ కనబడ్డారు..

అ-అ- అయ్యో! వీళ్ళు సామాన్లు ఎత్తుకు పోతున్నారు!
వీళ్లని ఆపాలి ఎలాగైనా.. ఏంచేయను? పోలీసు!!

దొంగపిల్లల్ని పట్టేసుకున్నాడు పోలీసు..!!



దుకాణం యజమాని సంతోషపడ్డాడు. కానీ
పోలీసు బాధగా అన్నాడు: ఇలా లాభం లేదు-
వీళ్ళని మంచి బళ్ళో వేసి చదివించాలి..

పోలీసు: నువ్వు ఏక్లాసు బాబూ?
మనోహర్: నేను చదువుకోవట్లేదు సార్!
మనోహర్ పోలీసుకు తన కథ చెప్పాడు.

నువ్వు బాధ పడకు మనోహర్! నిన్ను నేను
చదివిస్తాను.



మనోహర్ పెద్దయ్యాక పోలీస్ ఆఫీసర్
అయ్యాడు.

క్రిస్టఫర్ పాలిని

యువకెరటాలు

నిర్వహణ: సౌమ్య, పుస్తకం డాట్ నెట్.

దాదాపు పదేళ్ళక్రితం, ఈనాడు పత్రికలో పిల్లల పేజీలో ఒక వ్యాసం వచ్చింది. అది "ఎరగాన్" అన్న పుస్తకం గురించి, అది రాసిన **క్రిస్టఫర్ పాలినీ** గురించి.

నాకు ఎందుకు అది బాగా గుర్తుండిపోయింది అంటే, ఆ పుస్తకాన్ని రాయటం మొదలెట్టే నాటికి పాలినీ వయసు పదిహేనేళ్ళు! వందా, రెండొందల పేజీల పుస్తకం కాదది- ఐదొందల దాకా పేజీలు ఉన్నాయి. పెద్ద పుస్తకమే!

'ఎరగాన్' ఒక పిల్లల నవల. పది-పన్నెండేళ్ళ వయసు పిల్లలకి నచ్చేట్లు రాయబడింది. అంటే, చిన్న పాలినీ తనకన్నా చిన్న వాళ్ళకోసం, తానే ఒక నవల రాసాడన్నమాట! అందుకే అప్పట్లో నాకది బాగా గుర్తుండిపోయింది.

పాలినీ అమెరికాలో పుట్టి పెరిగాడు. పదో తరగతి వరకూ ఇంట్లోనే చదువుకున్నాడు. దూరవిద్య ద్వారా పదో తరగతి పాసయ్యాక, కొంచెం ఖాళీ సమయం చిక్కింది. 'ఆ సమయం అంతా కేటాయించి ఒక నవల రాస్తే ఎలా ఉంటుంది' అనుకున్నాడు. ఇంట్లో అమ్మా, నాన్నా, అక్కా అందరూ బలే ప్రోత్సహించారు. దాంతో పాలినీ నవల రాయడం మొదలుపెట్టాడు. అలా పుట్టింది, 'ఎరగాన్' అనే ఐదొందల పేజీల పుస్తకం! ఇందులో ఎరాగాన్ అనే పిల్లవాడి సాహసాలు, అతని జీవితంలో వచ్చిన మలుపులు ఉంటై. మధ్యలో పిట్టకథల్లా వేరు వేరు కథలు బోలెడు వస్తూ పోతూ ఉంటాయి. పాతకాలపు జానపద కథల్లోలాగా రకరకాల వింత ప్రాణులు, అద్భుత లోకాలు చాలా ఉంటాయి. పాలినీ వాళ్ల అమ్మావాళ్ళకి అది ఎంత నచ్చిందంటే, దాన్ని వాళ్ళే సొంతగా

ప్రచురించారు. అది చదివినవాళ్లకల్లా నచ్చింది; అనూహ్య విజయం సాధించింది. పాలినీకి ఎంతో పేరు తెచ్చిపెట్టింది- నెల రోజుల్లోనే చిన్న పాలినీ 'పెద్ద రచయిత' అయిపోయాడు!



ఐతే ఐదొందల పేజీలు రాసినా, పాలినీ కథ ఐపోనే లేదు! అది మొదటి భాగమేనట! ఒకసారి ఎరగాన్ రాసాక, దానికి కొనసాగింపుగా 2005 లో "ఎల్డెస్ట్" అని ఇంకో నవల, 2008 లో "బ్రిసింగ్గర్" అని మూడో నవల కూడా రాసాడు పాలినీ. ఇదే కథ కొనసాగింపుగా నాలుగో(ఆఖరు) పుస్తకం "ఇన్హెరిటన్స్ " 2011 నవంబరులో విడుదల కాబోతోంది! ఇప్పటిదాకా ఇతని పుస్తకాలు వివిధ భాషల్లో రెండు కోట్ల కాపీలు అమ్ముడు పోయాయట!

పాలినీ రాసిన కథలు పూర్తిగా కొత్తవేమీ కాదు- అంతకు ముందే వచ్చిన "లార్డ్ ఆఫ్ ది రింగ్స్", "బియోవుల్ఫ్" లాంటి నవలలకు చాలా దగ్గరగా ఉంటాయి ఇవి. పాలినీ కూడా ఆ విషయాన్ని ఒప్పుకుంటాడు- 'అవన్నీ చదివాకే, పిల్లల కోసం నవల రాయడం మొదలుపెట్టాను' అని! అయితేనేమి, పదిహేనేళ్ళ వయసులోనే ఇంత రాసాడంటే వాడు గొప్పవాడన్నట్లే కదా?

ఇంతకీ, అసలు ఇతని గురించి ఎందుకు చెబుతున్నాను అంటే - మనలో అందరికీ రకరకాల ఊహలు వస్తూ ఉంటాయి. "సచిన్ నా దగ్గరికి వస్తే ఏం మాట్లాడాలి?", "బెన్ టెన్ లో నేను కూడా ఒక పాత్రనైతే ఎలా ఉంటుంది?" ఇలా ఏదో ఒక విషయం గురించి అందరం ఊహించుకుంటూనే ఉంటాము కదా, ఆ ఊహలకే మరి కాస్త పదును పెట్టి, కథలు అల్లుతూ, వాటిని తోటివాళ్లతో పంచుకుంటూ ఉంటే ఎంత బాగుంటుంది! ఆటకు ఆటా ఆడినట్లు ఉంటుంది, మన ఊహాశక్తికి పదును పెట్టుకున్నట్లూ ఉంటుంది! అందరూ పాలినీలాగా ఐదొందల పేజీల నవలలు రాయనక్కర్లేదు- కానీ, చదువుతో పాటు, మన సృజనకి ఇలా పదును పెట్టుకుంటే తప్పేముంది? సరదాకి సరదా, పదసంపదకి పదసంపద!

సమీక్ష

కొత్తపల్లి నవంబరు 2011 సంచిక పై ఒక సమీక్ష.
నిర్వహణ: శ్రీమతి మాలతీ కృష్ణ, విద్యార్థి సృజన కుటీర్, విజయవాడ

చిన్నారులంతా బాలలదినోత్సవం సంబరంగా జరుపుకొని ఉంటారు కదూ! సంపాదకీయంలో 'సీను'లాగా ఉపన్యాసాలు అదరగొట్టేసారా మరి? పదింట తొమ్మిది పిల్లల కథలతో ఈసారి కొత్తపల్లి పుస్తకం నిజంగా బాలల దినోత్సవ ప్రత్యేక కానుకలాగా అనిపించింది.

వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలన్నట్లు, బద్ధకాన్ని వదలగొట్టటానికి మంచి ఉపాయమే చెప్పారు సౌమ్య అండ్ కో. దేవుడి తరపున పిశాచం రావటం మాత్రం వెరైటీ!

ఏనుగు, సీతాకోక చిలుకల కాంబినేషన్ తమాషాగా ఉంది. మామూలుగా పెద్ద జంతువులు చిన్నవాటిముందు బడాయి పోతాయి కదా! భువనేశ్వరి భిన్నంగా ఆలోచించింది. ఇంతకీ ఏనుగు, సీతాకోకచిలుకలు ఎలాంటి ఆటలు ఆడుకున్నాయో సరదాగా ఆలోచించచ్చుకూడా.

'గాడిద తన్నులు' కథనం కొత్తగా ఉంది. నక్కనుంచి గాడిద, ఆ తర్వాత పాప తప్పించుకోవటం కథలో కథలాగా ఉంది. మొత్తానికి పాప చాలా ధైర్యవంతురాలే!

'చేయగలం' అనే నమ్మకమే మనచేత అసాధ్యమనుకునే పనులు కూడా చేసేలా చేస్తుందని తెలుస్తోంది కదూ, ఆ కథ ద్వారా? 'రాజు పేద' అనే సినిమాలో ఓ 'జేబులో బొమ్మ' ఉంటుంది. అదీ ఇట్లానే, భలే పనులు చేయిస్తుంది, చంద్రశేఖర్ మంత్రంలా!

దొంగతనం చేసిన పవన్‌ని తోటమాలి మొదట కొట్టినా, మళ్ళీ తనే అతని మనసు మార్చటానికి ప్రయత్నించటం చాలా బాగుంది. అందుకు వేసిన ప్లాను కూడా బాగుంది.

ధర్మం రోడ్డుమీద పడిందనటంలో నిజంగానే చాలా పెద్దరికం కనబడింది. గాంధీతాతని ధర్మంతో సరిపోల్చటం నిజంగా ఆ చిన్నిబుర్రకి ఎలా సాధ్యమైందా అనిపించింది.

'పిశాచాల సహాయం' కథని వినిపించినప్పుడు, ఓ ఐదేళ్లపాప మొదట్లో చాలా కంగారు పడింది- రంగడిని వాళ్ల అమ్మ ఇంట్లోంచి వెళ్ళిపొమ్మన్నదేమిటని బాధపడింది- మళ్ళీ పిశాచాలు సహాయం చేయటం ఏమిటని కాస్త ఆశ్చర్యపోయింది- చివరికి అమ్మే ఆ నాటకంఆడించిందని తెలిసాక తృప్తిగా నవ్వింది! ఎంత బద్ధకస్తుడైనా, కొడుకుని తల్లి అలా వెళ్ళగొట్టదన్న నమ్మకం అబద్ధం కాదనుకుంటా. నాగమణి కథ చక్కగా వ్రాసింది.

చందమామలోని కుందేలుని ఆశ చూపెట్టి, నక్కనీ పులినీ స్పేస్‌షిప్‌లో అక్కడికి పంపించేద్దామన్న ఐడియా అనన్యకే సాధ్యం! కుందేలులా నువ్వూ భలే తెలివిగా ఆలోచించావు, అనన్యా!

రత్నహారపు సమస్యని పుణ్యవతి నిజంగానే చాలా మంచి ఉపాయంతో పరిష్కరించింది. చీమలు ఎంతటి ఘనకార్యమైనా చెయ్యగలవని తనకెలా తెలిసిందో, మరి!

అనురాగ్ చెప్తున్న 'నోటి దుర్వాసన' కథలో చివరికి వాసన పోయిందా, లేదా? ఆసుపత్రి పాలైనట్లున్నాడు, పాపం! ఇంకా నోట్లో మౌత్‌వాష్ పోసుకుంటూనే ఉన్నాడా? ఏమైందో వచ్చే సంచికలో చెబుతారనుకుంటా, కదూ?

అట్టమీద బొమ్మ, యువకెరటాలు యథాప్రకారం బాగున్నాయి. క్రిస్మస్ తాతయ్యకోసం, అందరికీ మరిన్ని కథలు, కబుర్లు కానుకలు తీసుకొచ్చే కొత్తపల్లికోసం ఎదురు చూస్తూ ఉందాం.

పదరంగం-10

ఈ పదరంగం చాలా సులభం! దీన్ని ఓ తెల్లకాగితంలో పూరించి పంపండి. మీ పేరుతో బాటు మీ బడి పేరు, తరగతి తప్పక రాయండి. సరైన సమాధానాలు పంపిన పిల్లల పేర్లను పదరంగం-11 తో పాటు ప్రచురించగలం. నిర్వహణ: దేవి, బెంగుళూరు.

1			■	■	2
	■	■	3	4	
5		6			■
	■	7		■	8
■	9		■	10	
11					■

ఆధారాలు:

అడ్డం:

1. కోడి కాని కోడి (3)
3. మోసం (3)
5. పిల్లల్ని కూర్చోబెట్టుకుని గిరగిరా తిరిగేది (5)
7. ఆడేది ఆటే అయితే పాడేది? (2)
9. మేకు సాగింది(2)
10. పశువులు మేసేది(2)
11. చాలా రకాలు(5)

నిలువు:

1. మీరు పూర్తి చేస్తున్నది (4)
2. గొట్టంలో వత్తు ఎగిరి పోయింది (2)
3. ఒక యుద్ధకళ-(మీరూనేర్చుకోవచ్చు)(3)
4. పట్టణం (2)
6. గజిబిజిగా పాలకూర (4)
8. సీత కష్టాలు సీతవి, దీని కష్టాలు దీనివి(2)
9. మే మే అని అరిచేది (2)
10. మంచి(2)

పదరంగం-9 కి సమాధానం

సరైన సమాధానం రాసి పంపిన పిల్లలు:

1. అసంగానందరెడ్డి, 4 వ తరగతి, అజంతా స్కూలు, నెల్లూరు.
2. ఏ.యస్. నందన, 4 వ తరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి.
3. జి.సత్యలక్ష్మి, రెండో తరగతి, ఇంటిబడి, చెన్నేకొత్తపల్లి.



1 కొం	డ	2 చి	లు	3 ప	■
గ	■	గు	■	4 గ	[illegible]
■	5 ఊ	రు	6 గు	రు	■
7 త	న	■	డి	■	8 అ
9 వి	నా	హం	■	10 న	కృ
11 క	ళ్ళు	■	12 మి	గ	[illegible]

చిట్టి పాటలు

రచన, గానం: 'కవికాకి' కీ.శే.జైసీతారాం, కోగిర, అనంతపురంజిల్లా.

అందాల బాల

అందాల బాలా
ఆడుకోవేల?
జిజ్జిపోయేవేళ
జో జో ఉయ్యాల
అమ్మపాడే జోల
కమ్మగుంది చాలా!

బంగరు బొమ్మ

బంగరు బొమ్మ మా పాప
మాపాప నవ్వులు రత్నాలు
మాపాప పలుకులు ముత్యాలు
మాపాప నడకల్లు నాట్యాలు
మాపాప ముంగురులు తుమ్మెదలు
మా పాప బుగ్గలు రోజాలు!

రంగుల రాట్నం!

అదిగో అదిగో అందాల పట్నం
పట్నంలోన బాలవిహార్
బాలవిహార్లో రంగులరాట్నం
రాట్నం చుట్టూ బచ్చెన గుర్రాల్
గుర్రాలెక్కి ట్స్చ్ట్స్చ్ట్స్చ్ట్స్చ్.
గుర్రాలెక్కి గిరగిర తిరుగుతు
సవారీ చేద్దాం చలో చలో!

ఏమంది?

కుక్కపిల్ల ఏమంది?
చక్కని చుక్కా రమ్మంది
పిల్లి కూన ఏమంది?
మల్లెమొగ్గ తెమ్మంది.
మేకపిల్ల ఏమంది?
మెడలో దండ ఇమ్మంది
ఆవుదూడ ఏమంది?
అందాల బొమ్మా లెమ్మంది!

ముద్రిత ప్రతుల వెల:

ప్రతి ఒక్కొంటికి: 20 రూ.

12 పుస్తకాలకైచందా: 240 రూ.

"కొత్తపల్లి ట్రస్టు" పేరిట యంవో/డిడిని ఈ చిరునామాకు పంపండి: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101, ఆంధ్రప్రదేశ్.

బ్యాంకు అక్కౌంటు వివరాలు:
"Kottapalli Trust",
A/c No. 0138101018809 (savings), Canara Bank, Chennekothapalli. IFSC: CNRB0000138

ఫోన్లు: 08559 240222, 7702877670

ఇ-మెయిలు: team@kottapalli.in

ఈ నెలలో ఏపని-ఎవరిది?

ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ: సుబ్బరాజు

సంపాదకత్వం: నారాయణ

వెబ్సైటు, సమాచార సాంకేతికత: ఆనంద్, లక్ష్మి

అక్షర కూర్పు: శ్రీలక్ష్మి

ముద్రణ: 'ముద్రిక' కృపాకరరావు

ముఖచిత్రం 'ఎడారిలో దేవుడు': వీరాంజి

చిత్రాలు: వీరాంజి, అడవిరాముడు, రాము, వినయ్, వాసు, సురేష్, వెంకట్.

బొమ్మకు కథ: జి.లలిత, telugu4kids

కథలు, పాటలు: చాలామంది పిల్లలు

ప్రత్యేక కృతజ్ఞతలు:

ప్రకృతి బడికి, మన లైబ్రరీ వారికి, telugu4kidsవారికి, కార్టూన్ల మూర్తిగారికి, మాలతీకృష్ణగార్లకి, రాధా రాజశేఖర్ గార్లకి, కంప్యూటర్లలో లైనక్సు వ్యవస్థను చక్కగా అందిస్తున్న ఉబుంటు వారికి, జింప్, అడాసిటీ తదితర ఓపెన్ సోర్సు సాఫ్టువేరు నిర్మాతలకు, ఇంకా పేర్లు రాయని అనేకమందికి.

పిల్లల్లో సృజనాత్మకత సహజం. కథలు, ఆటలు, పాటలు, బొమ్మలు దానికి ఊతాన్నిస్తాయి. మాతృభాషలో ఇష్టంగా చదవటం, తేలికగా రాయటం వస్తే అటుపైన అన్ని శాస్త్రాలూ సులభంగా వంటపట్టుతాయి-నిజం! అందుకని మీ పిల్లల్లో ఉన్న కాల్పనిక శక్తికి పదును పెట్టండి. వాళ్లను కథలు రాసేందుకు, పాటలు పాడేందుకు, బొమ్మలు వేసేందుకు ప్రోత్సహించండి. వాళ్ళ రచనల్ని మాకు పంపండి. కావాలనిపిస్తే మీరే ఇలాంటి పత్రికనొకదాన్ని మొదలుపెట్టండి- ఎలాగైనా సరే- పిల్లలు పెద్దవాళ్లయ్యేలోగా వాళ్ళు చాలా చాలా తెలుగు కథల్ని చదివేలా, రాసేలా చేయండి. మీ పిల్లలకు ఈ పత్రికలోని కథలు నచ్చుతాయనే మా నమ్మకం- వీటిని వీలైనంత మందితో పంచుకోండి. మీరు రాసిన పిల్లల కథలు ఏమైనా ఉంటే పనిగట్టుకునైనా సరే, మాకు పంపండి. వీలు చేసుకొని ప్రచురిస్తాం.

మంచి పుస్తకం:

మేథ में Tricks

మూడు భాషలూ కలిసి తయారైంది ఈ మాట- అర్థమైందిగా?

ఇవేవో ఒట్టి లెక్కలే అనుకునేరు. లెక్కలు, సోషలు, సైన్సుల్లో చిక్కుల్ని చక్కని భాషతో కలగలిపి అందించి, ఒకప్పటి పిల్లల్ని బాలజ్యోతి ద్వారా ఇరవైఐదు సంవత్సరాల పాటు ఉర్రూతలూగించారు అవసరాల రామకృష్ణారావుగారు. మేథ में Tricks అని ఆయనో శీర్షిక నడిపితే, దానికి తాము పంపిన సమాధానాలు సరైనవో కావో అని టెన్షన్ పడేవాళ్ళు ఆంధ్రదేశంలో పిల్లలు!



ఆనాటి ఆ చిక్కు ప్రశ్నల్నీ, వాటి సమాధానాల్నీ 2005 లో మూడు బుజ్జి పుస్తకాలుగా వెలువరించారు ఎమెస్కో వాళ్లు.

అంతగొప్ప అవసరాల వారు గత మాసం స్వర్గస్తులయ్యారు- దాంతో మరొక గణితవిశారదను తెలుగువాళ్ళు కోల్పోయినట్లయింది.

ఈ పుస్తకాల్లో భాష వ్యావహారికమే- ఐనా మరీ ఏమంత సరళం కాదేమో. అయినా తెలుగులో తొమ్మిదో తరగతి, ఆపైన చదివే పిల్లల మేధస్సుకు ఈ ట్రిక్కులు మంచి మేతే. పిల్లలకు అర్థం కాకపోతే అర్థం చేయించటానికి పెద్దలు ఎలాగూ ఉన్నారు!

ఎటొచ్చీ మాసపత్రికలో పెట్టినంత టెన్షను ఇప్పుడు ఈ సమస్యలు ఎలాగూ పెట్టవు- ఎందుకంటే ప్రశ్న వెంబడే సమాధానాలూ ఉన్నాయి కదమరి!

ఎమెస్కో వారినడిగి ఈ పుస్తకాలను తప్పక చదవండి..వీటిలోని సమస్యల్ని (సమాధానాలు చూడకుండా) మీకు మీరుగా పరిష్కరించేందుకు ప్రయత్నించండి- మీరెంత తెలివైనవాళ్ళో మీకే తెలుస్తుంది!

అయ్యో! తెలుగు రాదే, ఎలాగ?!

"కథలమ్మా కథలు! కథలమ్మా కథలు! రకరకాల కథలు! తెలుగుపిల్లల కథలు!"

"ఏం కథలు బాబూ? మా పిల్లలకు తెలుగు చదవటం రాదు. ఇంగ్లీషు కథలు ఏమన్నా ఉన్నాయా, నీ దగ్గర?"

"ఇంగ్లీషువైతే వేరేవాళ్ళ దగ్గర దొరుకుతాయండి. నా దగ్గర ఉన్న సరుకంతా తెలుగువాళ్ల కోసమే. ఏం, మీ పిల్లలు తెలుగువాళ్ళు కారాండీ? పాపం, వాళ్ళకి కొంచెం తెలుగు నేర్పించకపోయారూ?"

"ఏమో నాయనా! మా వాళ్లకైతే ఇంగ్లీషు అంటేనే ఇష్టం. ఆ ఇంగ్లీషు నేర్చుకునేసరికే వాళ్ల తల ప్రాణం తోకకొచ్చింది. ఇంక తెలుగు ఎక్కడ నేర్చుకుంటారు?"

"అవున్లెండి, పాపం. కానీ నా దగ్గర ఉన్నవి తెలుగు కథలేనండి. మీకు పనికిరావు."

"ఏదీ, ఓసారి చూడనియ్యి- పుస్తకం బానే ఉన్నట్టుందయ్యా, కాయితం, రంగులు అదీనీ- దీన్ని పాపం ఇంగ్లీషులో అచ్చెయ్యకపోయారూ? మీకూ కొంచెం అమ్మకాలుండేవి గద! ఇప్పుడు పిల్లలంతా ఇంగ్లీషు బళ్లలో చదివీ చదివీ, తెలుగుని పూర్తిగా మరచే పోతున్నారుగా?"

"అవునండీ, అందుకనే వీటిని తెలుగులో మాత్రమే అచ్చేస్తున్నాం. మీ పిల్లలకి ఈ కథలు కావాలంటే వాళ్ళు తెలుగు నేర్చుకోవాల్సిందే, తప్పదు. లేకపోతే ఇంకో మార్గం ఉంది- మీరు వాళ్లకి చదివి పెట్టచ్చు-"

"అవున్లే, అట్లాగైనా వాళ్లకి మెల్లగా తెలుగు చదవటం వస్తుందేమో, చూస్తాను. కథలు చదవటం కోసమన్నా వాళ్ళు తెలుగు నేర్చుకుంటారేమో"

"తప్పకుండా నేర్చుకుంటారు చూడండి. అదేమంత బ్రహ్మవిద్య? తలచుకుంటే వాళ్ళు ఒక్కరోజులో నేర్చుకోగలరు. కథల్లో మాయ మీకు తెలీనిదా? మీరు చిన్నప్పుడు ఎన్ని కథల పుస్తకాలు చదవలేదు?"

"అవును నాయనా! ఇప్పుడు తెలుగు పుస్తకాలే కరువైపోతున్నాయి"

"ఏమీ లేదండీ! ఆదరించేవాళ్లు ఉంటే భాష చటుక్కున పుంజుకుంటుంది. ఏం చేసినా తెలుగులో అర్థమైనంత బాగా పరాయి భాషలో ఎంతమందికి అర్థమౌతుంది, చెప్పండి? ఏదో ఒక మాయ చెయ్యాల్సిందేనండీ. మీ పిల్లలకి 'తెలుగు రాదు' అని ఊరుకోకండి. ఏదో ఒకటి చేసి వాళ్ళ భాషని వాళ్ళకి ఇవ్వాలి- లేకపోతే కుదరదు."

"అంతేనంటావా?"

"అంతేనండీ- వేరే మార్గం లేదు. మాతృభాష తర్వాతే, వేరే ఏదైనా."

Edited, typeset and Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph:08559 240222 E-mail: team@kottapalli.in and printed at Mudrica Offcet printers, Vijayawada, Phone:08662579129.